ఆదివారం
03-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 161
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కేరళ జీఎస్టీలో కోతేసిన కేంద్రం

తిరువనంతపురం: కేరళ రాష్ట్రానికి రావాల్సిన సమీకృత వస్తువులు, సేవల పన్ను సెటిల్‌మెంట్ నుంచి రూ.332కోట్లను కేంద్రం కోత విధించింది. ఈ కోతతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజార్చుతుందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న హేతుబద్ధతను వివరించాలని కేంద్రాన్ని కేరళ ప్రభుత్వం కోరింది.

ముంచుకొస్తున్న
మిచౌంగ్

- సముద్ర తీరంలో తీవ్ర అలజడి
- కోస్తాలో నేటి నుంచి విస్తారంగా వర్షాలు
- నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం
- దక్షిణ మధ్య రైల్వేలో 140కి పైగా రైళ్లు రద్దు
- అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశం
- జిల్లాకు కోటి చొప్పున నిధుల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/విశాఖపట్నం: మిచౌంగ్ తుపాను ముంచుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో ఆది, సోమవారాల్లో ఆంధ్ర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 5న నెల్లూరు-

- మిగతా 2 లో

భవితవ్యం తేలేది నేడే

- నాలుగు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఈసీ
- గెలుపుపై ఆశలు పెట్టుకున్న నేతలు
- కాంగ్రెస్, బీజేపీకి కీలకం కానున్న ఫలితాలు

న్యూఢిల్లీ : ఆరు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సెమీ-ఫైనల్‌గా రాజకీయ పార్టీలు భావిస్తున్న నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నవంబరులో విడతలవారీగా చత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, మిజోరం... ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. అయితే ఆదివారం మిజోరం మినహా నాలుగు రాష్ట్రాల ఓట్లను మాత్రమే లెక్కించనున్నారు. మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును ఒక రోజు వాయిదా వేసి 4వ తేదీన నిర్వహించనున్నారు. రాజస్తాన్, చత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్, మధ్యప్రదేశ్ అధికారంలో ఉన్న బీజేపీ మధ్య ఈ మూడు రాష్ట్రాల్లోనూ హోరాహోరీ పోరు సాగింది. ఇక తెలంగాణాలో కె.చంద్రశేఖరరావు నేతృత్వంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వరుసగా మూడవసారి గెలిచి 'హ్యాట్రిక్' కొట్టడంపై ఆశలు పెట్టుకుంది. అయితే ఇప్పటికే ఫలితాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొన్ని ఎగ్జిట్ పోల్స్ మధ్య ప్రదేశ్‌లో బీజేపీని ముందంజలో ఉంచాయి. రాజస్తాన్‌లో ఆ పార్టీకి ఆధిక్యాన్ని ఇస్తున్నాయి. మరోవైపు, తెలంగాణ, చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉందని అంచనా వేశాయి. పోస్టల్ బ్యాలెట్‌లతో ప్రారంభమై, మధ్య ప్రదేశ్‌లో 230 స్థానాలకు, చత్తీస్‌గఢ్‌లో 90, తెలంగాణలో 119, రాజస్తాన్‌లో మొత్తం 200 స్థానాలకుగాను ఒక అభ్యర్థి మరణించడంతో పోలింగ్ నిలిచిపోవడంతో 199 స్థానాలకు కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆదివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామని, చెల్లుబాటు అయ్యే పాస్‌లు కలిగి ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. మే నెలలో బీజేపీ నుంచి కర్నాటకను చేజిక్కించుకున్న కాంగ్రెస్ మధ్య ప్రదేశ్, తెలంగాణపై కన్నేసింది. రాజస్తాన్, చత్తీస్‌గఢ్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఈ ఎన్నికలలో అద్భుతమైన ప్రదర్శన 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి ఏర్పాటు చేసిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో పార్టీ స్థానాన్ని పెంచుతుంది. మధ్య ప్రదేశ్‌లో నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన శివరాజ్ సింగ్ చౌహాన్ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఆశతో బీజేపీ ఉంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు హిందీ ప్రాబల్య రాష్ట్రాల్లో తన పట్టును తిరిగి పొందాలని ప్రయత్నిస్తున్నందున రాజస్తాన్, చత్తీస్‌గఢ్‌ను తిరిగి గెలుచుకోవాలని కాషాయ పార్టీ ఆసక్తిగా ఉంది.

మధ్య ప్రదేశ్‌లో...

మధ్య ప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు 52 జిల్లా కేంద్రాల్లో జరుగుతుందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మాజీ సీఎం, ప్రత్యర్థి కమల్ నాథ్ వంటి రాజకీయ పెద్దలు సహా 2,533 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తమ పార్టీ 'భారీ మెజార్టీ'తో అధికారాన్ని నిలుపుకుంటుందని చౌహాన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్ నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ఓటర్లపై తనకు 'పూర్తి విశ్వాసం' ఉందని చెప్పారు. సీఎం చౌహాన్ (బుధ్ని స్థానం నుంచి), కమల్ నాథ్ (చింద్వారా నుంచి), ముగ్గురు బీజేపీ కేంద్ర మంత్రులు నరేంద్ర

- మిగతా 2 లో

జలవివాదంపై 6న కేంద్రం
కీలక భేటీ

హాజరుకానున్న ఏపీ, తెలంగాణ ఉన్నతాధికారులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కృష్ణా జలాల వివాదంపై పరిష్కారం, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణ తదితర అంశాలపై ఈనెల 6న ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, జల వనరుల శాఖ అధికారులతో కేంద్ర జలశక్తి శాఖ వీడియో సమావేశం నిర్వహించనుంది. ఈ అంశాలపై ఢిల్లీ నుంచి కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ శనివారం వీడియో సమావేశం నిర్వహించారు. అయితే తెలంగాణా సీఎస్ ఈరోజు సమావేశానికి హాజరు కాలేనని, 3వ తేదీ రాష్ట్రానికి సంబంధించిన శాసనసభ ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున 5వ తేదీకి సమావేశాన్ని మార్చాలని కోరారు. దీంతో రెండు రాష్ట్రాల అధికారులతో ఈనెల 6న వీడియో సమావేశం నిర్వహించనున్నట్లు దేబశ్రీ ప్రకటించారు. అన్ని అంశాలను కూలంకుషంగా చర్చించి ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అప్పటి వరకూ రెండు రాష్ట్రాలు పూర్తి సంయమనం పాటించాలని సూచించారు. నీటి

- మిగతా 2 లో

అదానీ బొగ్గు టెండర్ కాంట్రాక్టు స్కామ్‌పై
సమగ్ర విచారణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా?' అన్న చందంగా గనుల శాఖ అధికారుల తీరు ఉందని, అదానీ బొగ్గు కాంట్రాక్టులో జరిగిన కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డే అదానీకి దాసోహమంటూ అడిగిందల్లా అప్పనంగా అప్పగిస్తుంటే... మేము చేస్తే ఏమవుతుందిలే' అన్నట్లు రాష్ట్ర ఖజానాకు గండికొడుతూ ఏపీ గనుల శాఖ అధికారుల తీరు కొనసాగిందని, అదానీకి మేలు చేకూర్చేలా అధికారులు వ్యవహరించారని రామకృష్ణ పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్‌లోని సులియారిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న బొగ్గుగనుల బ్లాక్ నుండి బొగ్గు అమ్మకాలు చేసేందుకు అదానీ కంపెనీతో కాంట్రాక్టు కుదిరింది. గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి, టెండర్లకు నోడల్ అధికారిగా వ్యవహరించిన ఎస్‌వీసీ బోస్ ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించి నిబంధనలకు తిలోదకాలిచ్చారు. అదానీ కంపెనీకి అనుకూలంగా నిబంధనలు మార్చేశారు. బొగ్గు టెండర్ల కాంట్రాక్టు నిబంధనల ప్రకారం అదానీ కంపెనీ మూడేళ్లపాటు ప్రభుత్వ ఖాతాలో ఉంచేలా కనీసం రూ.250 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలి. ఈ మొత్తంపై

- మిగతా 2 లో

మహువాపై అనర్హత వేటు?

న్యూఢిల్లీ: డబ్బులు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటుపడే అవకాశం కనిపిస్తోంది. నైతిక విలువల కమిటీ లోక్‌సభకు ఈ నివేదికను సమర్పించిన తర్వాత ఆమెపై అనర్హత వేటు వేయాలని కేంద్రం కోరనున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ నాలుగు నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ రోజే నైతిక విలువల కమిటీ... ఆ నివేదికను లోక్‌సభ ముందు ఉంచనున్నట్లు సమాచారం. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరానందాని నుంచి మొయిత్రా డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై నైతిక విలువల కమిటీ విచారణ జరిపి, నివేదిక రూపొందించిన సంగతి తెలిసిందే. దానిని పరిశీలించేందుకు బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోన్కర్ నేతృత్వంలోని ఈ కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత దానిని

- మిగతా 2 లో

ఆదిత్య-ఎల్ 1లో సౌరగాలుల రికార్డు

ఫొటో షేర్ చేసిన ఇస్రో



బెంగళూరు: సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య-ఎల్ 1' తన ప్రయాణంలో మరో మైలురాయి చేరుకుంది. ఈ ఉపగ్రహంలోని ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్ తన ఆపరేషన్స్‌ను ప్రారంభించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో తాజాగా వెల్లడించింది. ఈ పేలోడ్‌లోని రెండు పరికరాలు పరిశోధనలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని, ఇవి సౌర గాలులను అధ్యయనం చేస్తున్నాయని తెలిపింది. ఈ ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్‌లో రెండు పరికరాలు ఉన్నాయి. ఇందులోని సూపర్‌థర్మల్

- మిగతా 2 లో

సంతకాల్లేని పోలీసు అధికారులు

డిజిటల్ వ్యవస్థకు తూట్లు

క్లియరెన్స్, ఇతర సర్టిఫికెట్ల కోసం నిరుద్యోగులు, విద్యార్థుల పడిగాపులు

విశాలాంధ్ర-కాకినాడ : రాష్ట్రంలో పోలీసు శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినా ప్రజలకు మాత్రం ప్రయోజనం అంతంతమాత్రమే. ఆనాటి మైత్రి సదస్సుల నుంచి నేటి ఫ్రెండ్లీ పోలీసు వరకు ప్రచారానికే పరిమితమైందని, పోలీసు స్టేషన్‌లో సజావుగా పనులు పూర్తయ్యే పరిస్థితులు లేవని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కనీసం పోలీసు అధికారులు జారీచేసే పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్లు (జాబ్ వెరిఫికేషన్), ఇతర సర్టిఫికెట్లు సకాలంలో అందించలేకపోతున్నారని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ దరఖాస్తులు పేరుకుపోయాయి. నెలల తరబడి పోలీసు స్టేషన్ల చుట్టూతిరుగుతూ నిరుద్యోగులు, విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. చాలా పోలీసు స్టేషన్లలో హౌస్ ఆఫీసర్లు (ఎస్ఐలు) కు సంతకాలు లేకుండానే ఉద్యోగాలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇది అక్షరాల నిజమనిపిస్తోంది. చాలామంది ఎస్ఐలకు నెలలు గడుస్తున్నా డిజిటల్ సంతకాలు లేవు. సకాలంలో తమ డిజిటల్ సంతకాలను రెన్యువల్ చేయించుకోరు. కొత్తవీ చేయించుకోరు. పోలీసు ఉన్నతాధికారుల ద్వారా వారం, పది రోజుల్లో అయిపోయే డిజిటల్ సంతకాలు చేయించుకోవడానికి నెలలు తరబడి స్థానిక పోలీసు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే చెప్పాలి. ఈ కారణంగానే దరఖాస్తుదారులు పోలీసు స్టేషన్ల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. ఏ పోలీసు స్టేషన్‌లో అయినా ఎస్ఐ బదిలీ అయితే అక్కడ రెండు, మూడు నెలలు సర్టిఫికెట్ల జారీ నిలిచిపోతోంది. సర్కిల్ ఆఫీసులలోనూ ఇదే తతంగం జరుగుతోంది. ఈ సమస్యను పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. సమాచార చట్టం-2000 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, కంపెనీలు, వ్యాపార సంస్థలలో డిజిటల్ సంతకాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఒట్టు సార్..ఎలక్షన్‌లు అయిపోయాయి కదా..ఇంక మా ఊరికిపోతున్నా ఏదో ఒక పనిచేసి బతకాలి కదా!

గంట గగనమే!

- ట్యాబ్‌ల వినియోగం అంతంత మాత్రమే
- దెబ్బతిన్న 7 వేల ట్యాబ్‌లు
- ఉపాధ్యాయులపై పెరిగిన పని ఒత్తిడి
- పాఠశాలల్లో ఇంటర్నెట్ సమస్య
- పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌ల వినియోగ సమయం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరగడం, విద్యార్థులకు ఇంటర్నెట్ సమస్యలు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయులకు వివిధ యాప్‌లు, బోధనేతర పనులను ప్రభుత్వం అప్పగించడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ట్యాబ్‌లను సగటున దాదాపుగా గంట లేదా ఆపైన మాత్రమే వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయులు 77 నిముషాలు వినియోగిస్తుండగా విద్యార్థులు 67 నిముషాలపాటే వీక్షిస్తున్నారు. ఈ ట్యాబ్‌ల డేటా వివరాలను విద్యాశాఖపై సీఎం జగన్ నిర్వహించిన సమీక్షలో అధికారులు వెల్లడించడం గమనార్హం. గతేడాది సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎనిమిదో తరగతిలో ప్రవేశించిన విద్యార్థికి ఈ ట్యాబ్‌లు ఒక్కసారి ఇస్తే పదో తరగతిలోకి వచ్చేంత వరకు ఉపయోగించుకోవచ్చు. అందులో తరగతికి

- మిగతా 2 లో

గుర్తించడం, వేటాడటం, చంపేయడం

2 లో

గాజాపై దాడులకు ఇజ్రాయిల్ వ్యూహం

గాజాపై రెండు నెలలుగా భీకర దాడులను ఇజ్రాయిల్ కొనసాగిస్తోంది. హమాస్‌ను ఏరిపారేస్తామంటూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఏకపక్షంగా ముందుకు సాగుతున్నారు. గోల్డా మీర్ వంటి వారి మార్గాన్ని అనుసరిస్తూ 'ఆపరేషన్ వ్రాత్ ఆఫ్ గాడ్' తరహా మిషన్‌తో మారణహోమం సృష్టిస్తున్నారు.

గుర్తించడం, వేటాడటం, చంపేయడం

గాజాపై దాడులకు ఇజ్రాయిల్ వ్యూహం

వాషింగ్టన్: గాజాపై రెండు నెలలుగా భీకర దాడులను ఇజ్రాయిల్ కొనసాగిస్తోంది. హమాస్‌ను ఏరిపారేస్తామంటూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఏకపక్షంగా ముందుకు సాగుతున్నారు. గోల్డా మీర్ వంటి వారి మార్గాన్ని అనుసరిస్తూ 'ఆపరేషన్ వ్రాత్ ఆఫ్ గాడ్' తరహా మిషన్‌తో మారణహోమం సృష్టిస్తున్నారు. గాజాలో దురాక్రమణ ముగిసిన తర్వాత ఖండాలు దాటి వెళ్లి ఇజ్రాయిల్ శత్రువులను హతమార్చేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. అనుకున్న పనిని పూర్తి చేసే దిశగా టర్కీ, లెబనాన్, ఖతార్‌లో ముఖ్యలక్ష్యాలను మట్టుపెట్టడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని మొసాద్ (ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ సంస్థ)కు ఆదేశాలు ఇచ్చారని వాల్ స్ట్రీట్‌జర్నల్ నివేదించింది. హమాస్‌కు మద్దతిస్తుంది కాబట్టి టర్కీపై ఇజ్రాయిల్ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. మొసాద్ హిట్‌లిస్ట్‌లోని ఇస్మాయిల్ హనియే, మహమ్మద్ డైఫ్, యాహ్యా సిన్వర్, ఖాలెద్ మషాల్ పేర్లు టాప్‌లో ఉన్నట్లు సమాచారం.

ఇస్మాయిల్ హనియే: ఇస్మాయిల్ హనియే (60) పలస్తీనా మాజీ ప్రధాని. 2017లో హమాస్ పొలిటికల్ బ్యూరో అధినేతగానూ ఆయన ఎన్నికయ్యారు. 2006లో పలస్తీనా ప్రధానిగా ఉన్నప్పుడు ఆయనపై విష ప్రయోగం జరిగింది. ఆయన స్వచ్ఛంద అజ్ఞాత వాసంలో ఉన్నారు.

మహమ్మద్ డైఫ్: ఈయన హమాస్ సైన్యం (ఎజిడైన్ అల్ ఖసమ్ (బ్రిగేడ్స్) అధిపతి. ఇజ్రాయిల్‌కు నంబర్ వన్ శత్రువు. ఇజ్రాయిల్ యంత్రాంగం ఈయనను కనీసం ఆరు సార్లు హతమార్చేందుకు యత్నించింది. 2015 నుంచి అంతర్జాతీయ ఉగ్రవాదుల అమెరికా జాబితాలోనూ ఈయన పేరు ఉంది. అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి క్రమంలో వెలువడిన ఆడియో సందేశంలో డైఫ్ స్వరం వినిపిస్తుంది. ఈయన ఎక్కడ ఉన్నది ఎవరికీ తెలియదు. గాజా స్ట్రిప్‌లో హమాస్‌తో కలిసి పోరాడుతున్నట్లు సమాచారం.

యాహ్యా సిన్వర్: యాహ్యా సిన్వర్ (61) హమాస్ సైనికమ ఆజీ కమాండర్. 2017లో గాజాలో హమాస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఫ్రెంచ్-ఇజ్రాయిలీ సైనికుడు గిలాద్ షాలిట్ (హమాస్ బందీ) విడుదలకు బదులుగా ఈయన 2011లో ఇజ్రాయిల్ జైలు నుంచి విడుదలయ్యారు. అంతకుముందు 23 ఏళ్లు ఆయన ఇజ్రాయిల్ జైల్లో మగ్గారు. గాజాకు తరలించబడ్డ ఇజ్రాయిలీ బందీలు కొందరు సిన్వర్‌ను చూసినట్లు చెప్పారు.

ఖాలెద్ మషాల్: మషాల్ హమాస్ పొలిట్‌బ్యూరో వ్యవస్థాపక సభ్యుడు. 2017 వరకు చైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం ఖతార్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది. 1997లో జోర్డాన్‌లో సంచలనాత్మక హత్యాయత్నం ఈయనపై జరిగింది. కెనడా పర్యాటకుల రూపేణ మొసాద్ ఏజెంట్లు ఆయన చెవిలో విషం చల్లే ప్రయత్నం చేశారు. మొసాద్ బృందం పట్టుబడగా మషాల్ కోమాలోకి వెళ్లారు. అప్పట్లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బిల్ క్లింటన్ జోక్యం చేసుకోవాల్సి రాగా విషానికి విరుగుడును తీసుకొని నాటి మొసాద్ చీఫ్ డానీ యాతమ్ అమ్మన్‌కు చేరుకున్నారు. కాగా, వీరు ఎప్పుడో చనిపోవాల్సిందని అదనపు కాలం జీవిస్తున్నారని ఇటీవల ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గల్లంత్ వ్యాఖ్యానించినట్లు రాయిటర్స్ పేర్కొంది. హమాస్ యోధులు, కమాండర్ల మగ్‌షాట్‌లు కొన్ని వందల సంఖ్యలో టెల్ అవీవ్ కార్యాలయం గోడలపై ఉన్నట్లు సమాచారం.

గాజాలో బాంబుల కంటే

రోగాలతోనే అధిక ప్రాణనష్టం

డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక - తక్షణ చర్యలకు పిలుపు

ఆరోగ్య వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని ఇజ్రాయిల్‌కు సూచన

జెరూసలేం: గాజాలో బాంబు కంటే రోగాల వల్ల ప్రాణ నష్టం అధికంగా సంభవించే అవకాశముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) హెచ్చరించింది. ఈ పరిస్థితిని నివారించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని ఇజ్రాయిల్‌కు సూచించింది. రెండు నెలలుగా గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ భీకర దాడుల్లో చనిపోయిన, గల్లంతైనవారి సంఖ్య 20వేలకుపైగా ఉంది. కనీస అవసరాలకు పలస్తీనియన్లు నోచుకోవడం లేదు. సర్వం కోల్పోయి శిబిరాల్లో ఆశ్రయం పొందుతూ పారిశుద్ధ్యానికి దూరమయ్యారు. వ్యాధులు ప్రబలుతున్నాయి. తక్షణమే పరిస్థితుల్లో మార్పు రాకుంటే తీవ్ర పరిణామాలు తప్పబోవని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది. ఆరోగ్య వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని నొక్కిచెప్పింది. లేనిపక్షంలో బాంబుల కంటే వ్యాధుల బారిన పడి అధిక మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్ఓ అధికార ప్రతినిధి మార్గరెట్ హారిస్ వెల్లడించారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు 207 మంది వైద్య సిబ్బంది మరణించగా, 56 అంబులెన్సులపై దాడులు జరిగాయి. 26 ఆసుపత్రులు, 55 ఆరోగ్య కేంద్రాలు పనిచేయడం లేదు. నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలను మృత్యుకౌగిట్లో వదిలేసిన వైనం కలచివేసింది. చనిపోయిన ఆ పసివారి మృతదేహాలు కుళ్లిపోయే దృశ్యం అల్ నసర్ ఆసుపత్రిలో వెలుగు చూసింది. తుపాకీ ఎక్కుపెట్టి ఆ పసి పిల్లలను వదిలి వెళ్లేలా పలస్తీనా వైద్య సిబ్బందిని ఇజ్రాయిల్ దళాలు బలవంత పెట్టాయి. 'దురాక్రమణ మొదలైన రోజే మందుల సరఫరా, ఇంధనం, విద్యుత్ నిలిపివేశారు. ఆరోగ్య వ్యవస్థను పూర్తిగా స్తంభింపజేశారు' అని పలస్తీనా ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి అష్రాఫ్ అల్ ఖుద్రా వెల్లడించారు. గాజాలో ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిపోయిందని,

ఇది చాలా విధాలుగా విపత్తుకరమని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి హారిస్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. అవసరాలు పెరుగుతున్నాయి కానీ వాటిని తీర్చేందుకు వనరులుగానీ సాధనాలుగానీ లేవన్నారు. కాలిన గాయాలు, విరిగిన కాళ్లు చేతులతో అనేక మంది ఆసుపత్రుల దరిచేరుతుంటే వారికి సరైన చికిత్స అందించే పరిస్థితి లేకపోవడం దారుణమన్నారు. ఆశ్రయం పొందేవారు, వైద్యం అవసరమవుతున్న వారి సంఖ్య పెరుగుతోందేగానీ తగ్గడం లేదు. పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. మందుల కొరత తీవ్రమవుతోంది. కనీస వసతులు లేవు. తాగేందుకు, స్నానానికి నీళ్లు లేవు. దీంతో ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నాయి. డయారియా బాధితులు ఎక్కువయ్యారు. ఐదేళ్లలోపు పిల్లల్లోనే అతిసారా కేసులు 31రెట్లు ఎక్కువగా కేసులు నమోదు కాగా పెద్దలలో 104 రెట్లు ఎక్కువగా ఉన్నాయి' అని వెల్లడించారు. వైద్యారోగ్య వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించకుంటే పరిస్థితులు మరింతగా క్షీణిస్తాయని, నివారించగల రోగాల వల్ల కూడా మరణాలు అధికంగా సంభవిస్తాయని హారిస్ హెచ్చరించారు.

---

61 మంది జర్నలిస్టులు మృతి

గాజా/జెరూసలేం: ఇజ్రాయిల్ దాడుల్లో 61 మంది జర్నలిస్టులు చనిపోయారు. ఈమేరకు కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) ఓ ప్రకటనలో తెలిపింది. కాల్పుల విరమణకు జరిగిన సంధి ముగిసిన గంటల్లోగా ఇజ్రాయిల్ దాడులతో గాజాపై విరుచుకుపడింది. 24 గంటల్లో వైమానిక, భూతల, సముద్ర దళాలు జరిపిన దాడుల్లో 400 ఉగ్రవాద లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ సైన్యం శనివారం ప్రకటించింది. అనేకమంది హమాస్ సైనికులను మట్టుబెట్టినట్లు తెలిపింది. సంధి ముగిసిన వెంటనే ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 200 మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు హమాస్ మీడియా పేర్కొంది. ఏడు రోజుల సంధి సక్రమంగా అమలు కాకపోవడానికి రెండు వర్గాలు పరస్పరం నిందలు మోపుకున్నాయి. అయితే అత్యంత తీవ్రమైన మానవతా అత్యవసర పరిస్థితికి ఈ పోరు దారితీస్తుందని ఐరాస హెచ్చరించింది.

భవితవ్యం తేలేది నేడే

(మొదటిపేజీ తరువాయి)

సింగ్ తోమర్, ప్రహ్లాద్ పటేల్, ఫగ్గన్ సింగ్ కులస్తే భవితవ్యాన్ని కూడా ఈవీఎంలు నిర్ణయించనున్నాయి.

రాజస్థాన్‌లో...

గత మూడు దశాబ్దాలలో ప్రతి ఐదేళ్లకు కాంగ్రెస్, బీజేపీ మధ్య అధికారం మారిన రాజస్థాన్‌లోని 199 స్థానాల్లో 1800 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉదయం 8.30 గంటలకు ఈవీఎం యంత్రాల్లోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రవీణ్ గుప్తా తెలిపారు.

చత్తీస్‌గఢ్‌లో...

చత్తీస్‌గఢ్‌లోని 33 జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావితమైన జిల్లాలతో సహా అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రీనా బాబా సాహెబ్ కంగలే తెలిపారు. ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్, ఉప ముఖ్యమంత్రి టి.ఎస్.సింగ్ దేవ్ (ఇద్దరూ కాంగ్రెస్ నుంచి), బీజేపీకి చెందిన మాజీ సీఎం రమణ్ సింగ్‌తో సహా మొత్తం 1,181 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

తెలంగాణలో...

బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు, ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ లోక్‌సభ సభ్యులు బండి సంజయ్‌కుమార్, డి.అరవింద్, సోయం బాపురావు సహా 2,290 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ మొత్తం 119 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగా, కాంగ్రెస్ ఒక స్థానాన్ని సీపీఐకి కేటాయించి, మిగిలిన స్థానాల్లో పోటీ చేసింది. ఇక బీజేపీ 111 స్థానాల్లో పోటీ చేసి, ఎన్నికల పొత్తులో భాగంగా జనసేనకు 8 స్థానాలు కేటాయించింది. ఇక అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం హైదరాబాద్ నగరంలోని 9 నియోజకవర్గాల్లో పోటీ చేసింది.

జలవివాదంపై 6న కేంద్రం కీలక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

విడుదలకు సంబంధించి ఏపీ ఇచ్చిన నీటి మోతాదుపై కృష్ణా నది యాజమాన్య బోర్డు ఈనెల 4న సమావేశం నిర్వహించాలని జలశక్తి శాఖ కార్యదర్శి కేఆర్ఎంబీ చైర్మన్ శివనందన్‌కు సూచించారు. నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని, అప్పటి వరకూ నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి నీటి విడుదలను ఆపాలని కోరారు. కృష్ణా జలాల పంపకంపై విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణా రాష్ట్రాలకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్‌రెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద నెలకొన్న పరిస్థితులను వివరించారు. విభజన చట్టంలో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం నీరు విడుదల చేయాలని అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, ఆ కారణంగానే ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. 6వ తేదీన జరిగే సమావేశంలో ఇందుకు సంబంధించి అన్ని అంశాలను సమావేశం దృష్టికి తీసుకువస్తామని సీఎస్ జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య-ఎల్ 1'లో సౌరగాలుల రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్‌ను సెప్టెంబరు 10న, సోలార్ విండ్ అయాన్ స్పెక్ట్రోమీటర్‌ను నవంబరు 2న యాక్టివేట్ చేశారు. ఈ రెండు తమ కార్యకలాపాలను సజావుగా సాగిస్తున్నాయని ఇస్రో తాజా ప్రకటనలో వెల్లడించింది. స్విస్‌లో ఉన్న రెండు సెన్సర్లు 360 డిగ్రీల్లో తిరుగుతూ పనిచేస్తున్నాయి. ఇవి నవంబరులోని రెండు తేదీల్లో సోలార్ విండ్ అయాన్లు, ప్రైమరీ ప్రోటాన్స్, ఆల్ఫా పార్టికల్స్‌ను విశ్లేషించినట్లు ఇస్రో తెలిపింది. ఈ సెన్సర్ సేకరించిన ఎనర్జీ హస్టోగ్రామ్‌ను పరిశీలించిన తర్వాత... ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్స్‌లో కొన్ని వైవిధ్యాలు ఉన్నట్లు గుర్తించామని ఇస్రో పేర్కొంది. ఈ తాజా విశ్లేషణతో సౌర గాలుల లక్షణాలపై సుదీర్ఘంగా నెలకొన్న ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరికే అవకాశముందని ఇస్రో వివరించింది. అంతేగాకుండా సౌర గాలుల్లో అంతర్లీనంగా ఉండే ప్రక్రియలు, భూమిపై అవి ఎలాంటి ప్రభావం చూపుతాయనే విషయంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని తెలిపింది. లాగ్రాంజ్ పాయింట్ వద్ద చోటుచేసుకునే కరోనల్ మాస్ ఎజెక్షన్‌పై ఓ అవగాహనకు రావచ్చని వెల్లడించింది. సూర్యుడిపై అధ్యయనం కోసం ఈ ఏడాది సెప్టెంబరు 2న నింగిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య-ఎల్ 1' తన ప్రయాణంలో దాదాపు చివరి దశ చేరుకుంది. ఈ ఉపగ్రహాన్ని ఎల్1 పాయింట్‌లో ప్రవేశపెట్టేందుకు నిర్వహించాల్సిన విన్యాసాలు వచ్చే ఏడాది జనవరి 7వ తేదీ నాటికి పూర్తవుతాయని ఇటీవల ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. భూమి నుంచి 15 లక్షల కి.మీ దూరంలో ఉన్న లాగ్రాంజ్ పాయింట్-1 చేరాక... దాని కక్ష్యలో పరిభ్రమిస్తూ ఆదిత్య-ఎల్ 1 సూర్యుడిని అధ్యయనం చేస్తుంది.

మహువాపై అనర్హత వేటు?

(మొదటిపేజీ తరువాయి)

6:4 మెజారిటీతో ఆమోదించింది. మహువా అనైతిక ప్రవర్తన, సభా ధిక్కరణకు పాల్పడ్డారని కమిటీ పేర్కొంది. అందుకే ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని సిఫార్సు చేసింది. తాజాగా ఈ సమావేశాల్లో దానిని ప్రవేశపెట్టి చర్చ జరిపే అవకాశం ఉంది. ఆమెపై అనర్హత వేటు వేయాలని కేంద్రం కోరనున్నట్లు తెలుస్తోంది.

'అత్యంత తీవ్రమైన శిక్ష': కాంగ్రెస్

న్యూఢిల్లీ : పార్లమెంటు నుంచి టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను బహిష్కరించడం 'అత్యంత తీవ్రమైన శిక్ష. ఈ చర్య చాలా విస్తృతమైన పరిణామాలను కలిగి ఉంది' అని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. డిసెంబరు 4న పార్లమెంటు శీతాకాల సమావేశాల ముందు ఈ మేరకు శనివారం స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రత్యేకాధికారాల కమిటీ, నైతిక విలువల కమిటీకి ఉద్దేశించిన పాత్రలలో ముఖ్యంగా శిక్షాపరమైన అధికారాలను ఉపయోగించడంలో స్పష్టమైన హద్దులు లేవని పేర్కొంటూ, పార్లమెంటరీ కమిటీల నియమాలు, ప్రక్రియలను పునః పరిశీలించాలని చౌదరి డిమాండ్ చేశారు. మహువా మొయిత్రాను పార్లమెంటు నుంచి బహిష్కరించాలని నైతిక విలువ కమిటీ చేసిన సిఫారసులపై మీడియాలో వచ్చిన కథనాలు సరైనవే అయితే లోక్‌సభ నైతిక విలువల కమిటీ చేసిన మొదటి సిఫార్సు ఇదే అవుతుందని చౌదరి స్పీకర్‌కు రాసిన నాలుగు పేజీల లేఖలో పేర్కొన్నారు. 'పార్లమెంటు నుంచి బహిష్కరణ, మీరు అంగీకరిస్తారు సార్, ఇది చాలా తీవ్రమైన శిక్ష, చాలా విస్తృతమైన పరిణామాలను కలిగి ఉంది' అని ఆయన అన్నారు. 'అనైతిక ప్రవర్తన', 'ప్రవర్తనా నియమావళి' కి స్పష్టమైన నిర్వచనం లేదని, విధివిధానాల నిబంధన 316బి కింద ఊహించినప్పటికీ, ఇంకా రూపొందించాల్సి ఉందని ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ కూడా అయిన చౌదరి అన్నారు. కమిటీ అనుసరిస్తున్న విధానాలతో సహా ఈ సమస్యలపై లోతైన శ్రద్ధ, స్పీకర్ మార్గదర్శకత్వంలో ప్రక్రియలను క్రమబద్ధీకరించడం అవసరమని కాంగ్రెస్ నాయకుడు లేఖలో పేర్కొన్నారు. 'మీ నాయకత్వం, నియంత్రణలో, ఎటువంటి అన్యాయం జరగదని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. సభ్యులందరికీ ప్రయోజనం చేకూర్చేలా పార్లమెంటు పనితీరు, సభ నిర్వహణకు సంబంధించిన ప్రక్రియలు సజావుగా సాగుతాయి' అని చౌదరి చెప్పారు. నైతిక విలువల కమిటీ సమావేశాల కార్యకలాపాలు చాలా గోప్యంగా ఉంటాయని కాంగ్రెస్ నేత ఎత్తి చూపారు. అయినప్పటికీ, కమిటీ చైర్మన్ అలాగే ఫిర్యాదుదారు సభ్యుడు ఈ విషయం విచారణలో వారి అభిప్రాయాలను బహిరంగంగా వ్యాఖ్యానిస్తూ తీర్పులు ఇస్తున్నారు' అని పేర్కొన్నారు. 'నగదుకు ప్రశ్న' కేసులో మొయిత్రా బహిష్కరణకు సిఫార్సు చేస్తూ లోక్‌సభ నైతిక విలువల కమిటీ నివేదిక సోమవారం దిగువ సభలో ప్రవేశపెట్టనున్నారు. నవంబరు 9న జరిగిన సమావేశంలో కమిటీ ఈ ఆరోపణపై మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలని సిఫార్సు చేస్తూ తన నివేదికను ఆమోదించింది.

ముంచుకొస్తున్న 'మిచౌంగ్'

(మొదటిపేజీ తరువాయి)

మచిలీపట్నం మధ్య తుపాను తీరం దాటనుంది. ఈ నేపథ్యంలో డిసెంబరు 3 నుంచి 6వ తేదీ వరకు దాదాపు 140 రైళ్లను ముందు జాగ్రత్తగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. ఇక నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ శాఖ కేంద్రం తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా 580 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రాగల 24 గంటల్లో ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ తుపానుగా బలపడి, ఏపీ తీరం వెంబడే పయనిస్తూ డిసెంబరు 5న నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటనుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఫలితంగా ఈ నెల 3 నుంచి 6 వరకు రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. డిసెంబరు 4, 5 తేదీల్లో కోస్తాంధ్ర, యానాంలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. రాయలసీమ జిల్లాల్లో డిసెంబరు 3 నుంచి 5 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, 3న కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు పడతాయని వివరించింది. కోస్తా జిల్లాల్లో 70 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలోని జాతీయ విపత్తు నిర్వహణ కమిటీ తుపాను కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల సన్నద్ధతను సమీక్షించింది. తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, పుదుచ్చేరికి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) 18 బృందాలను అందుబాటులో ఉంచింది. కోస్ట్ గార్డ్, సైన్యం, నావికాదళానికి చెందిన సహాయక, పునరావాస బృందాలతో పాటు నౌకలు, విమానాలను సిద్ధంగా ఉంచారు. ఆదివారం నుంచి కోస్తా తీరం వెంబడి గంటకు వంద కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు మంగళవారం వరకు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ అధికారులు తెలియజేశారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి : సీఎం జగన్ ఆదేశం

బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్రవాయుగుండం తుపానుగా మారుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. తుపాను పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈనెల 4న ఆంధ్ర ప్రదేశ్‌లోని నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, అది ఉత్తర దిశగా ప్రయాణించే అవకాశాలున్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. తుపాను నేపథ్యంలో అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభావిత జిల్లాల కలెక్టర్లు సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్, రవాణా వ్యవస్థలకు అంతరాయాలు ఏర్పడితే వెంటనే వాటిని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట సహాయ శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. రక్షిత తాగునీరు, ఆహారం, పాలు శిబిరాల్లో ఏర్పాటు చేసుకోవాలని, ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు 8 జిల్లాలకు ముందస్తుగా ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది.

తిరుపతి జిల్లాకు రూ.2 కోట్లు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, ప.గో, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రూ.1 కోటి చొప్పున విడుదల చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖ జిల్లాలో తుపాను కంట్రోల్ రూమ్‌ను, తీర ప్రాంతంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సంతకాల్లేని పోలీసు అధికారులు

(మొదటిపేజీ తరువాయి)

అమలులోకి వచ్చాయి. పోలీసు శాఖకు చెందిన సర్టిఫికెట్లు అనగా విద్యార్థులు, నిరుద్యోగులకు అవసరమయ్యే పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు (జాబ్ వెరిఫికేషన్), సెల్ ఫోన్ లాంటి వస్తువులు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, డాక్యుమెంట్లు పోయినా, పాడైనా కొత్త వాటికోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమయ్యే లాస్ట్ అండ్ డ్యామేజ్ సర్టిఫికెట్లు, వివిధ రకాల లైసెన్స్ రెన్యువల్, దరఖాస్తులను మీ సేవ కేంద్రాలు, గ్రామ వార్డు సచివాలయాలు, ఏపీ సేవ పోర్టల్, ఏపీ మీసేవ పోర్టల్ ద్వారా ఈ సర్వీసులకు ఆన్ లైన్‌లో విధిగా ప్రజలు దరఖాస్తు చేసుకోవాలి. అయితే ప్రభుత్వం జవాబుదారీతనం కోసం, అవినీతిని అరికట్టి సకాలంలో పౌరులకు సేవలందించేందుకు ఉద్దేశించిన డిజిటల్ విధానం ఆచరణలో పక్కదోవ పడుతోంది. ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో ప్రారంభమైన పూర్తిస్థాయి ఆన్ లైన్ సేవలు నేటి ముఖ్యమంత్రి జగన్ వరకు కొనసాగుతూనే ఉన్నాయి. అయినా పోలీసు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి పోలీసు స్టేషన్లు, సర్కిల్ ఆఫీస్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

కాకినాడ జిల్లాలో పేరుకుపోతున్న దరఖాస్తులు

కాకినాడ జిల్లాలో పోలీసు శాఖలో డిజిటల్ వ్యవస్థకు తూట్లు పొడిచేలా ఉంది. గతంలో పని చేసిన కాట్రేనికోన ఎస్ఐ శ్రీనివాస్ డిజిటల్ సైన్ కాల పరిమితి ముగియడంతో రెండు నెలలకు పైగా ఇక్కడ సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయింది. ఆయన డిజిటల్ సంతకం రెన్యువల్ అయి వచ్చేసరికి ఆకస్మిక బదిలీతో వెళ్లిపోయారు. తీరా కొత్త ఎస్ఐ నాగేశ్వరరావు జాయిన్ అయి నెల దాటినా ఇంతవరకు డిజిటల్ సంతకం రాక ఒక్క సర్టిఫికెట్ కూడా జారీ కాలేదు. బదిలీపై వచ్చి నెలలు గడుస్తున్నా ముమ్మిడివరం సీఐకు డిజిటల్ సంతకం రాలేదంటే ఆశ్చర్యం కలగకమానదు. సర్కిల్ పరిధిలోని కాట్రేనికోన, ముమ్మిడివరం, తాళ్లరేవు మండలాల్లో పాస్‌పోర్టులు పోగొట్టుకున్న బాధితులు పెట్టుకున్న ఆన్ లైన్ దరఖాస్తులు కంప్యూటర్లలో పేరుకుపోయాయి. పోయిన పాస్‌పోర్ట్ సర్టిఫికెట్ కోసం సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో రూ.1,050 ఫీజు చెల్లించి నెలల తరబడి తిరుగుతున్నామని, ఇతర దేశాలకు వెళ్లలేక ఉపాధి కోల్పోతున్నామని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. దరఖాస్తుల ఫీజుగా పోలీసు శాఖకు లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా పౌర సేవలు అందించడంలో పోలీసు అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. కనీసం పోలీసు స్టేషన్లు తనిఖీ చేసినప్పుడు ప్రజలకు పౌర సేవలు ఎలా అందుతున్నాయో పట్టించుకున్న దాఖలాలు లేవంటున్నారు. పోనీ మాన్యువల్‌గా సర్టిఫికెట్లు తీసుకుందామంటే వివిధ ప్రభుత్వ శాఖలు, కంపెనీలు అనుమతించక ఉద్యోగాలు కోల్పోతున్నామని నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. తీరా డిజిటల్ సైన్ దేంగులు వచ్చినా స్థానిక పోలీసులు లేనిపోని కొర్రెలు వేస్తూ తిప్పుతున్నారని, సిఫార్సులు ఉన్నవారికి, సొమ్ములు ఇచ్చిన వారికి క్షణాల్లో సర్టిఫికెట్లు అయిపోతాయని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. సర్టిఫికెట్లను సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్ ప్రకారం జాబ్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ తదితర సర్టిఫికెట్లు ఏడు రోజులు, లాస్ట్ అండ్ మిస్సింగ్ సర్టిఫికెట్లు 20 నుంచి 30 రోజుల రోజుల్లోపు తప్పనిసరి జారీ చేయవలసి ఉంది. లేకుంటే విచారణలో వాస్తవ కారణం చూపిస్తూ తిరస్కరించాల్సి ఉన్నా అదీ చేయరు. ఎస్ఎల్ఏ గడువు దాటినా స్టేషన్ కంప్యూటర్లలోనే నెలల తరబడి దాచిపెడతారు.

చాలా పోలీసు స్టేషన్లలో ఇదే తంతు జరుగుతోంది. సర్టిఫికెట్ల జారీ ఆలస్యానికి సంబంధిత అధికారులు జరిమానాలు కూడా చెల్లించాల్సి ఉంది. క్రింది స్థాయిలో సరైన పర్యవేక్షణ లేని పోలీసు శాఖలో ఇవేమీ అమలు జరగవని, ఇదే అదనుగా క్రింది స్థాయి పోలీసు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దరఖాస్తుదారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పోలీసు శాఖ ద్వారా పౌర సేవలు సకాలంలో అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని అసౌకర్యాన్ని తొలగించాలని సర్వత్రా కోరుతున్నారు.

సమగ్ర విచారణ

(మొదటిపేజీ తరువాయి)

మూడేళ్లలో వచ్చే వడ్డీని ప్రభుత్వమే తీసుకుంటుంది. కానీ వెంకటరెడ్డి బ్యాంకు గ్యారెంటీ స్థానంలో పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.250 కోట్లు చెల్లించేలా నిబంధనలు మార్చారు. ఆ సొమ్మును వడ్డీతో కలిపి పది నెలల్లోనే తిరిగి అదానీకి చెల్లించారు. వడ్డీ, అసలు కలిపి మొత్తం రూ.306 కోట్లు అదానీకి ఇచ్చేశారు. ఇప్పుడు ఏపీఎండీసీ దగ్గర ఏ గ్యారెంటీ లేకపోగా ఈఎండీ కింద కోటి రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఎటువంటి గ్యారంటీ లేకుండానే అదానీ కంపెనీ వేలకోట్ల రూపాయల బొగ్గు వ్యాపారం చేసేందుకు దారులు వేశారు. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు రూ.202 కోట్ల నష్టం వాటిల్లింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వివిధ మైనింగ్‌ల విషయాల్లో ఏపీఎండీసీపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు అదానీకి మేలు చేసేందుకు గనుల శాఖ అధికారులు కూడా అమ్ముడుపోయారా? అసలు బ్యాంక్ గ్యారెంటీ లేకుండా టెండర్ ఎలా పిలిచారు? ఎవరికి మేలు చేయడానికి నిబంధనలు మార్చారు? 30 వేల కోట్ల బొగ్గు వ్యాపారానికి ఈఎండీ కోటి రూపాయలేనా? బ్యాంకు గ్యారంటీ కాకుండా పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్‌తో సరిపెట్టడం వెనుక ఎంత ముడుపులు ముట్టాయి? మూడేళ్ల కాంట్రాక్టులో కేవలం 10 నెలల్లోనే డిపాజిట్‌ను వడ్డీ సహా తిరిగి అదానీకి ఎలా ఇచ్చేశారు? ఈ అక్రమాల వెనుక ఎవరున్నారు? ఎంత ముడుపులు ముట్టాయి? ఇవన్నీ తేలాలంటే అదానీ బొగ్గు టెండర్ కాంట్రాక్టులో జరిగిన భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని, రాష్ట్ర ఖజానాకు గండికొట్టిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

గంట గగనమే!

(మొదటిపేజీ తరువాయి)

అనువుగా బైజూస్ కంటెంట్ పొందుపరుస్తారు. పాఠశాలల పనిదినాల్లో ట్యాబ్‌లు వినియోగం అతి తక్కువగా ఉన్నప్పటికీ ఆదివారం, పండుగలు, ఇతరత్రా సెలవుల్లో ట్యాబ్‌లను కనీసం రెండు లేదా మూడు గంటలపాటు వినియోగించే అవకాశముంటుంది. ఉపాధ్యాయులపై బోధనేతర పనులు రుద్దడంతోనే ట్యాబ్‌ల వినియోగం తగ్గిపోతోందని చెబుతున్నారు. వాటికి తోడు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ సమావేశాలు అధికం చేశారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ పనుల వివరాల నమోదులో నిమగ్నమైపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సీబీఎస్ఈ విద్య పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో ఉండటం, దానికితోడు బైజూస్ కంటెంట్‌ను ప్రవేశపెట్టింది. దీనిని సమర్థవంతంగా వినియోగించుకుంటే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసి వదిలేసిందని, వాటిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించలేదనే విమర్శలున్నాయి. దీంతోనే ట్యాబ్‌లను వినియోగించే నిడివి పెరగడం లేదని సమాచారం.

ట్యాబ్‌ల వినియోగంతో ఫలితమెంత ?

ట్యాబ్‌ల పంపిణీతో మెరుగైన విద్యాబోధన ఉందా? వాటివల్ల విద్యార్థులకు ఎంత ప్రయోజనం చేకూరుతుందనేదీ ప్రభుత్వం సమీక్షించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గత విద్యా సంవత్సర మొదటి బ్యాచ్‌లో ట్యాబ్‌లు పొందిన ఎనిమిదో తరగతి విద్యార్థులంతా ఈ విద్యా సంవత్సరంలో 9వ తరగతిలోకి వచ్చారు. దాదాపు ఏడాదికిపైగా వారు ట్యాబ్‌లు వినియోగిస్తున్నారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు 5,18,740 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన ట్యాబ్‌లలో 7వేలకుపైగా వివిధ కారణాల రీత్యా దెబ్బతిన్నాయి. ఉన్న ట్యాబ్‌లే సరిగ్గా వినియోగించకపోవడంతో మళ్లీ ఈనెలలో రెండో బ్యాచ్ ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. అన్ని ట్యాబ్‌లలో పిల్లల సందేహాలు తీర్చే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అలాంటివి జరగడం లేదు. ట్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించుకున్న విద్యార్థులు చదువులో ముందుంటున్నారని, పరీక్షల్లోనూ వారికి మంచి మార్కులు వస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వినియోగించని విద్యార్థులు వెనుకబాటుకు గురవుతున్నారు. ట్యాబ్‌ల వినియోగంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎదురవుతున్న సాంకేతిక సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలి. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించి, కేవలం బోధనకే వినియోగించేలా చూడాలి. అప్పుడే ట్యాబ్‌ల వినియోగంతోపాటు విద్యార్థులకు మెరుగైన చదువుకు దోహదపడుతుంది. ప్రభుత్వం ట్యాబులు పంపిణీ చేసి... పర్యవేక్షణను విస్మరించిందనే విమర్శలున్నాయి.

పాఠశాలలకు ఇంటర్నెట్ లేకుండా ఎలా ?

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సదుపాయం లేదు. దీంతో ట్యాబ్‌లను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించలేక పోతున్నారని తెలిసింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులకు ట్యాబ్‌లపై అవగాహన లేదు. ఇంటికి వెళ్లాక తమ పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులకు తెలియడం లేదు. ట్యాబ్‌ల వినియోగంలో గ్రామీణ ప్రాంత విద్యార్థుల కంటే పట్టణాల విద్యార్థులే ముందంజలో ఉన్నారు. పాఠశాలల్లో ఉన్నంత వరకు అక్కడి ఇంటర్నెట్ ద్వారా ట్యాబ్‌లు కొద్దిగా వినియోగిస్తున్న విద్యార్థులు...ఇంటికి వెళ్లాక డేటా లేకపోవడంతో ట్యాబ్‌లను పక్కన పెడుతున్నారు. కొంతమంది విద్యార్థులు వారి ట్యాబ్‌లలోకి సోషల్ మీడియా, ప్లే గేమ్స్ ఇతరత్రా కంటెంట్‌ను అప్‌లోడ్ చేసుకుంటున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అలా చేసిన వారి ట్యాబ్‌లో బైజూస్ కంటెంట్ మనుగడలో ఉండబోదు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసే సమయంలోనే వారు ఇతర కంటెంట్‌లోకి వెళ్లకుండా ట్యాబ్‌లలో సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. కేవలం ప్రభుత్వం ఉచితంగా అందించిన బైజూస్‌కే పరిమితం చేసింది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం రీత్యా విద్యార్థులు బయట మార్కెట్‌లో ఇతర కంటెంట్‌ను అప్‌లోడ్ చేయించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం పొందుపరిచిన బైజూస్ కంటెంట్ తొలగిపోవడం వల్ల విద్యార్థుల చదువులకు నష్టం కలుగుతోంది. ఈ ట్యాబ్‌లు కొందరు విద్యార్థులకు, తల్లిదండ్రులకు కేవలం సోషల్ మీడియా, వినోద కార్యక్రమాల వినియోగానికి మారిపోయాయనే విమర్శలున్నాయి. పాఠశాలల్లో విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించినప్పటికీ ఇంతవరకు ఆ బిల్లుల చెల్లింపు జరగలేదు. చాలా పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు పేరుకుపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గొప్ప ఆశయంతో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు పంపిణీ చేసిన ట్యాబ్‌లు పూర్తిస్థాయిలో వినియోగించడం లేదు. దీనిపై ప్రభుత్వం స్పందించి విద్యార్థులు, తల్లిదండ్రులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించాలి. అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

మిచౌంగ్ తుపాను తీవ్రత నుంచి రైతాంగాన్ని ఆదుకోండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిందని, రైతాంగం వరి కోతలు, నూర్పిళ్లు, పత్తి తీతలు, మిర్చి కోతలు కోసి ఎండబెట్టడంలాంటి వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారని తెలిపారు. తుపాను కారణంగా పంట ఉత్పత్తులు తడిసిపోతాయని, తీవ్ర నష్టం జరుగుతుందనే భయాందోళనలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టుకొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం తడిసిపోకుండా నూర్చిన ధాన్యాన్ని రైతులు తక్షణం అమ్ముకొనేలా ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ఎటువంటి అడ్డంకులు కల్పించకుండా కొనుగోలు చేయాలి. పంట ఉత్పత్తులు ఆరబెట్టుకునేందుకు, తడవకుండా కాపాడుకునేందుకు రైతాంగానికి 90 శాతం సబ్సిడీతో ప్లాస్టిక్ పట్టాలు అందజేయాలి. వరి ధాన్యం నింపుకొనేందుకు అవసరమైన గోతాలు ఆర్బీకేల ద్వారా సరఫరా చేయాలి. అలాగే రైతాంగం వద్ద, ఆర్బీకే కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యాన్ని తక్షణం మిల్లులకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బందికి జీతాలివ్వండి: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి శనివారం ఒక ప్రకటన చేశారు. మూడు నెలల వేతనాల బకాయిల చెల్లింపు కోసం సమగ్ర శిక్షా అభియాన్ ఒప్పంద కార్మికుల సంఘం అధ్వర్యంలో జిల్లాలస్థాయిలో ఆందోళనలు జరుగుతున్నట్లు తెలిపారు. వెంటనే వేతనాలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రకటనలో హెచ్చరించారు.

నేడు సాగర తీరంలో కథలతో ఒకరోజు...

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కథాసాహితి సంకనాల రచనలో 33వ కథ '2022' ఆవిష్కరణ సభ ఆదివారం జరగనుంది. మిత్ర సాహితీ విశాఖపట్నం అధ్వర్యంలో1990 నుంచి ఉత్తమ కథలను కథాసాహితి అందిస్తున్నది. విశాఖ పౌర గ్రంథాలయంలో ఆవిష్కరణ సభ ఉదయం 10గంటలకు ప్రారంభం కానుంది. కాళీపట్నం రామారావు శతజయంతి స్మారక ఉపన్యాసం నేపథ్యంలో కథ 2022 రచయితలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. సభకు ప్రముఖ రచయిత గంటేడ గౌరు నాయుడు అధ్యక్షత వహిస్తారు. పుస్తకాన్ని ప్రముఖ కవి నందిని సిదారెడ్డి ఆవిష్కరించారు. పుస్తక సమీక్షలుగా ప్రముఖ కవి కొప్పర్తి, ఆత్మీయ అతిథులుగా కన్నెగంటి చంద్ర, ఎల్ఆర్ స్వామి, కల్లూరి శ్యామల, కేఎస్ మల్లేశ్వరి, వీవీ రమణమూర్తి, చింతకింది శ్రీనివాసరావు, వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ హాజరుకానున్నారు.

రాజధాని పేరుతో పేదలతో ఆటలా!

- రైతుల పట్ల రాక్షసత్వం తగదు
- గుండెలు ఆగుతుంటే ప్రభుత్వానికి పట్టదా?
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాజధానుల పేరుతో ఆటలాడటం తప్ప అమరావతి రాజధానిని అభివృద్ధి చేద్దామని ఏ కోశానా లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మండిపడ్డారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ రాజధాని అమరావతిని విశాఖకు తరలిస్తున్నామని, 8వ తేదిన జగన్‌మోహన్ రెడ్డి వైజాగ్ వెళ్తారని ప్రత్యేక జీవో ఇచ్చారన్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఏదో చెప్పు కోలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధానిపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష కట్టి రాక్షసత్వంగా వ్యవహరిస్తోందన్నారు. మూడు రాజధానుల పేరుతో నాటకాలాడుతూ రాజధాని గ్రామాలను సర్వనాశనం చేశారని అన్నారు. కోర్టు తీర్పుకి కట్టుబడి రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలే తప్పా తప్పుడు పద్ధతుల్లో జగన్‌మోహన్ రెడ్డికి జై కొడితే జైలు పాలు కావడం ఖాయమని అధికారులకు సూచించారు. రాష్ట్రాన్ని బడా కార్పొరేట్లకు తాకట్టు పెడుతూ వారికి దోచిపెడుతున్నారని జగన్ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం జరిగితే భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందకు వచ్చి భూములు ఇచ్చిన రైతులను మోసం చేయడం సమంజసం కాదన్నారు. రాజధానికి పొలాలు ఇచ్చిన రైతులకు మే నెలలో కౌలు వేయాలని, కానీ నేటికి వేయలేదని విమర్శించారు. అన్నం పెట్టే రైతన్నలకు న్యాయం చేయలేని స్థితిలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్, కమిషనర్ శ్రీలక్ష్మి, సీఆర్‌డీఏ, మున్సిపల్ సెక్రటరీ, మంత్రులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలలైన రైతుకు కౌలు చెల్లించకుంటే వారి కుటుంబాలు ఎలా ముందుకు వెళ్ళతాయని, వారి పిల్లల చదువులు ఎలా కొనసాగుతాయని, ఇంటి ఖర్చు, నిత్యావసరాలు ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం ఒక రాక్షస ప్రభుత్వంలా వ్యవహరిస్తోందని విమర్శించారు. నైజాం నవాబు కన్నా గొప్పవాడినని విర్రవీగిన తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు నేడు ఫాం హౌస్‌లో పడుకునే పరిస్థితి వచ్చిందని, అదేవిధంగా రాష్ట్రంలో నిరంకుశ వైఖరి అవలంభిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కూడా అదే పరిస్థితి దాపురిస్తుందని అన్నారు. రాజధాని ప్రాంతంలోని పేదలు 17 వేల మందికి తాము అధికారంలోకి రాగానే రూ.2500 నుంచి రూ.5 వేలకు పెన్షన్ పెంచుతామని, నేటికి ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రైతుల ఆవేదనను అర్థం చేసుకుని వారికి న్యాయం చేయాలని, వారికి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాజధాని జేఏసీ, ఇతర జేఏసీలు, రాజధాని మహిళలతో కలిసి కార్యాచరణ రూపొందిస్తామని, ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రానున్న ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నాయకులు చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

215వ రోజు యువగళం పాదయాత్ర

విశాలాంధ్ర-పిఠాపురం టౌన్: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర శనివారం 215వ రోజు చిత్రాడ నుంచి ప్రారంభమైంది. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ... లోకేశ్‌కు ఘన స్వాగతం పలుకుతూ గజమా లతో ఆయన్ను సత్కరించారు. వేలాది మంది జన సంద్రం మధ్య లోకేశ్ పాదయాత్ర పిఠాపురంలోకి అడుగుపెట్టింది. అనేక సంఘాలు లోకేశ్‌ను కలసి తమ సమస్యపై వినతి పత్రాలు అందించారు. ప్రజలకు అభివాదం చేస్తూ, వారి సమస్యలు వింటూ యు.కొత్తపల్లి మండలం కొండెవరంలోకి యువగళం పాదయాత్ర అడుగుపెట్టింది. ఈ పాద యాత్రలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, కంభంపాటి రామ్మోహన్ రావు, చిక్కాల రామచంద్రరావు, జ్యోతుల నవీన్, టీడీపీ శ్రేణులు ఉన్నారు.

అప్పడే జనసేన పతనం ఆరంభం: ఆమంచి కృష్ణమోహన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీతో కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్న రోజు నుంచే జనసేన పతనం మొదలైందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. పవన్ కల్యాణ్ కేవలం చంద్రబాబు కోసమే పార్టీ పెట్టినట్లు కనిపిస్తోందని విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ-జనసేనకు భావజాల వ్యత్యాసం చాలా ఉందన్నారు. పవన్‌ది వింతైన వ్యవహారమని విమర్శించారు. వైసీపీ అనేది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలనకు కొనసాగింపుగా వచ్చిందన్నారు. వైసీపీ సిద్ధాంతంలేని పార్టీగా పవన్ వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టారు. టీడీపీతో కలిసి జనసేన పార్టీ విస్తృతంగా పనిచేయాలని పవన్ చెప్పాడో, ఆనాడే ఆ పార్టీ పతనం ప్రారంభమైందన్నారు. అప్పటివరకూ జనసేన పార్టీకి పనిచేసిన కాపు సామాజికవర్గ నేతలతోగానీ, ఇన్నాళ్లు ఆ పార్టీ భావజాలం నచ్చి పనిచేసిన కీలకనేతలతో గానీ ఎలాంటి సంప్రదింపులు, చర్చలు చేయకుండా రాత్రికి రాత్రి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకెళ్లి చంద్రబాబును కలిసి మద్దతిస్తానని పవన్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. చంద్రబాబును అధికారంలోకి తేవడమే పవన్‌కల్యాణ్ లక్ష్యమని మండిపడ్డారు. సీఎం జగన్ పేరెత్తే అర్హత పవన్‌కు లేదని, జనసేనలా వైసీపీ ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకునే అవసరం లేదని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి జాతీయపార్టీ నేత హోదాలో మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు చంద్రబాబును ఏమని మాట్లాడారో, ఎలా విమర్శించారో ప్రజలు మరిచిపోలేదని గుర్తుచేశారు.

Govt of ANDHRA PRADESH

Collectorate Office, Kakinada

Rc.L6/70/2022 Dated : 29-11-2023

FORM No – VI (A)

(Under Section 11 (1) of the Act. 30 of 2013

Read with Sub Rule (1) of Rule 19

PRELIMINARY NOTIFICATION

Whereas it appears to the District Collector, Kakinada that the land specific in the schedule below and situated in **Peddapuram village & Mandal,** Kakinada District are needed for a public purpose to wit acquisition of land widening of Samarlakota to Rajanagaram under Visakhapatnam Chennai Industrial Corridor Development Project for provisions of Section-11(1) of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013 (Central Act No.30 of 2013). Notice to that effect is hereby given to all whom it may concern in accordance with the provision of Section 11(1) of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013 (Central Act No.30 of 2013).

There are no habitations on the proposed acquisition of land of Ac.0.05 Cts.

Now, therefore, in exercise of the powers conferred under section-12 of the Act, the District Collector, Kakinada District hereby designates the Land Acquisition Officer & Revenue Divisional Officer, Peddapuram his staff and workmen to exercise the powers conferred under the above said section.

No Social Impact Assessment is necessary in this case, since already Environmental Impact Assessment was done at the time of construction of project during the year 2016 by the Environment protection training and research institute. Moreover this is only an extension of existing Road.

Under section-11(4) of the Act, no person shall make any transaction or cause any transaction of land i.e., sale/purchase etc., or create any encumbrances on such land from the date of this notification without the prior approval of the Collector.

Objections to the acquisition, if any, may be filed by the person(s) interested within 60 (Sixty) days from the date of publication of this Notification as provided under Section-15 of the Act before the Collector.

SCHEDULE

Mandal: Peddapuram **Village: Peddapuram**

Sl No	Sy No	Total Extent	Sub-Division No	Acquire extent	Classifi Cation	Name of the person	Boundaries				Trees / Buildings
							North	South	East	West	
1	23	9.06	2	0.05	ID	Sri Boorugupalli Sreeramarao S/o Thimmaraju	23/1	22	Valuthimmapuram Village	21	11-Take Trees 1-Mango Tree 3- Palmary Trees
Totoal				0.05							

Sd/- **Dr. Krithika Shukla,** I.A.S.,
Collector & District Magistrate,
Kakinada District, Kakinada

ఇఫ్టా పాదయాత్రలు జయప్రదం చేయండి

- 18న గుంటూరులో ప్రారంభం
- కరపత్రాలు ఆవిష్కరించిన ప్రజానాట్యమండలి నేతలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో ఇఫ్టా జాతీయస్థాయి పాదయాత్రలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ పాదయాత్రల కరపత్రాలను శనివారం వారు విడుదల చేశారు. చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శాంతి, ప్రేమ, కరుణ, దయ కరువవుతోందని, అందువల్లనే మనుషుల మధ్య దూరం పెరిగి మానవత్వం మంటగలుస్తోందన్నారు. మనిషిని మనిషి నిర్దాక్షిణ్యంగా హత్య చేసే ఘటనలు సర్వసాధారణమయ్యాయన్నారు. పైగా ఇలాంటి ఘటనలు మనుషుల్ని కలవరపెట్టడం కూడా మానేస్తున్నాయని చెప్పారు. అందుకోసమే ఇఫ్టా జాతీయ నాయకత్వంలో ప్రేమ, కరుణ, దయతోపాటు మంచితనం, మానవత్వం, సమానత్వం, సమన్యాయం, సౌభ్రాతృత్వం కాపాడడం కోసం సెప్టెంబర్ 28 నుంచి పాదయాత్రలు ప్రారంభమయ్యాయని తెలిపారు. దేశంలో మతోన్మాదం, కులోన్మాదం పెచ్చరిల్లి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవడం, ప్రజల్ని చైతన్యవంతం చేయడం కళల ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఆటా, పాటా, మాట వివిధ కళలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ పాదయాత్రలు దోహదపడతాయన్నారు.

మానవతావాదులు, అభ్యుదయ, శాంతికాముకులు వివిధ రంగాలకు చెందిన కళాసంస్థలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పి.చంద్ర నాయక్ మాట్లాడుతూ దేశంలో భిన్న సంస్కృతులు, భిన్న జాతులు, భిన్న సంప్రదాయాలతో ప్రజలు జీవిస్తున్నారని, కానీ దేశం మనువాదుల చేతిలో పడి అరాచకాలతో అల్లాడుతున్నదని విమర్శించారు. మానవ సంబంధాలు మరుగున పడుతున్నాయని, మంచితనం, మానవత్వం సన్నగిల్లుతోందన్నారు. వీటిని రక్షించుకోవడానికి ఈనెల18వ తేదీన గుంటూరులో పాదయాత్ర ప్రారంభించి 22వ తేదీన విజయవాడలో ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో బహిరంగసభ జరుగుతుందన్నారు. ఈ పాదయాత్ర, బహిరంగసభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కే నజీర్, విజయవాడ నగర గౌరవాధ్యక్షుడు లంకా దుర్గారావు, నగర కార్యదర్శి దోనేపూడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు చేయూత

పేరి కామేశ్వరరావు భరోసా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చనిపోయిన పేద బ్రాహ్మణ కుటుంబాలను బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు చెప్పారు. విజయవాడ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ భవన్‌లోని తన చాంబర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పేద బ్రాహ్మణులకు ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కల్పించే దిశగా సీఎం జగన్ అత్యంత నమ్మకంతో ఈ పదవి తనకు అప్పగించారని కామేశ్వరరావు చెప్పారు. తమ డైరెక్టర్లు, ప్రభుత్వ సిబ్బందితో పూర్తి సమాచారం తీసుకుని...పూర్తి అవగాహనతో కార్యచరణ రూపొందించామన్నారు. బ్రాహ్మణులు అందరికీ ఎలాంటి వివక్ష లేకుండా అన్ని రకాల సదుపాయాలను నవరత్నాల ద్వారా అందిస్తున్నామని, నాలుగున్నర ఏళ్లలో రూ.716 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని వేద పాఠశాలలకు ప్రభుతం నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, వేద విద్యార్థులను అమ్మఒడి పథకంలో చేర్చడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. గరుడ పథకం ద్వారా 109 మంది మరణించిన కుటుంబ సభ్యుల వారసులకు ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున మంజూరు చేశామన్నారు. గుంటూరు జిల్లా యడవల్లిలో ఉన్న సత్రాల మరమ్మతులపై తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. భవిష్యత్‌లో సీఎం జగన్ సూచనలతో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలనే విషయంలో తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించామన్నారు. ఉపనయన స్కీమ్, కల్యాణమస్తు పథకాలపైన, సత్రాల అభివృద్ధి పైన ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. సత్రాల అభివృద్ధితోపాటు అనేక విషయాలపై తమ డైరెక్టర్లతోను, ప్రభుత్వ అధికారులతోను చర్చించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు తుర్లపాటి కనకదుర్గ, బి.అనుపమ, రాయల్, పూర్ణానంద శర్మ, వై.సాయి సురేశ్, పేరు బాబు, కుప్పం ప్రసాదరావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు సీఎం ఇచ్చిన

హామీ తక్షణం అమలు చేయాలి

- 4 నుంచి 11వ తేదీ వరకు జరిగే సత్యాగ్రహ దీక్షలు జయప్రదం చేయండి
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు

విశాలాంధ్ర-కాకినాడ: అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి రావు డిమాండ్ చేశారు. అసోసియేషన్ కాకినాడ జిల్లా సమావేశం శనివారం స్థానిక గాంధీ భవన్‌లో కొల్లేటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 19.52 లక్షల మంది ఖాతాదారుల నుంచి రూ.3,950 కోట్లు వసూలు చేసిందని, ఆ సంస్థ మూసివేసే నాటికి వారి ఆస్తి సీఐడీ లెక్కల ప్రకారం కొన్ని కార్లు, 7 లక్షల నగదు, సుమారు 16 వేల ఎకరాల కొన్ని వాణిజ్య స్థలాలు మాత్రమే జప్తు అయ్యాయని, మిగిలిన ఆస్తులు ప్రశ్నార్థంగా మారాయని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులు సమస్యలతో సతమతమవుతూ బతకలేక, చావలేక, అప్పుల ఊబిలో కూరుకుపోయారని, బాధితులకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను అధికారంలోకి రాగానే ఆరు మాసాలలో బాధితులకు వడ్డీతో సహా పూర్తిగా చెల్లిస్తానని, కంపెనీ సంగతి తేలుస్తానని, కోర్టు సంగతి నేను చూసుకుంటానని హామీ ఇచ్చి ఆ హామీని ఇప్పుడు తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులకు రావాల్సింది 3,080 కోట్ల రూపాయలని, బాండ్స్ రూపంలో ఉన్న సొమ్మును తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 4 నుంచి 11వ తేదీ వరకు సత్యాగ్రహ దీక్షలు చేపడుతున్నామని, 18వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని, 28, 29 తేదీల్లో చనిపోయిన వారి కుటుంబాల బాధితులతో కలిసి విజయవాడలో 36 గంటల దీక్ష చేపడతామని తెలిపారు. కామిరెడ్డి బోడకొండ, తోకల ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఈనెల 4 నుంచి జరిగే సత్యాగ్రహ దీక్షలకు అగ్రిగోల్డ్ బాధితులందరూ తప్పనిసరిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఐదు సంవత్సరాల కాలంలో అగ్రిగోల్డ్ బాధితులపై ఏ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులుగానీ స్పందించలేదని, కనీసం అసెంబ్లీలో తమ గళం వినిపించలేదని, ప్రజా సమస్యలు పట్టించుకోని పాలకులకు పాలించే అర్హత లేదని విమర్శించారు. వారి ఆస్తులు కాపాడుకోవడం, దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజా సమస్యలపై స్పందన కరువైందని, అలాంటి వారిని గద్దె దింపి ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.పాల్, వై.కె.రాజు, బొమ్మిటి రాంబాబు, ఎ.చంద్రశేఖర్, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కేంద్రం ఉపేక్ష వల్లే జలజగడం

కృష్ణా జలాలు ప్రధానంగా నాగార్జున సాగర్ ఆనకట్ట ద్వారా వెళ్లే నీటికోసం జలజగడం ప్రారంభమైంది. సాగునీటి కోసం చాలా రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నట్టుండి తెలంగాణలో పోలింగ్ మర్నాడు జరిగే ముందు రోజు రాత్రి హఠాత్తుగా నాగార్జున సాగర్ ఆనకట్ట మీద దండయాత్ర చేసింది. భారీగా పోలీసు బలగాలను నియోగించి 13వ గేటు దగ్గర రెండువేల క్యూసెక్కుల నీరు విడుదల చేసుకుంది. మంచి నీటి కోసమే ఈ నీరు విడుదల చేశామని ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు వాదిస్తున్నారు. మంచి నీళ్లకోసమే నీటినివిడుదలచేశామన్న ఆయనవాదన నిజమేనని అనుకున్నా... దండు వెడలవలసిన అగత్యం ఏమిటో అంతు పట్టదు. నాగార్జున సాగర్ ఆనకట్టకు మొత్తం 26 గేట్లు ఉంటే 13 గేట్లు ఆంధ్రప్రదేశ్‌కు,13 గేట్లు తెలంగాణకు కేటాయించారు. ఈ గొడవ సంగతి తెలుసుకున్న తెలంగాణ పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లడంతో రెండు రాష్ట్రాల పోలీసులకు మధ్య ఘర్షణ జరగడం అత్యంత దారుణం. రెండు రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలు కూర్చుని మాట్లాడుకోవలసిన సమస్యను బలవంతాన నీటి విడుదల దాకా తీసుకెళ్లడం ఆశ్చర్య కరం. కృష్ణా జలాల బోర్డు నాగార్జున సాగర్ ఆనకట్ట నిర్వహణ బాధ్యత తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి శ్రీశైలం ఆనకట్ట నిర్వహణా బాధ్యతను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యపై తెలంగాణ ప్రభుత్వం కృష్ణానది నిర్వహణా బోర్డుకు ఫిర్యాదు చేసింది. దీనితో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. శనివారం రెండు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులను పిలిపించింది. కానీ వారు వెళ్లకుండా అంతర్జాల సహాయంతో ఈ సమావేశానికి హాజరయ్యారు. తీరా ఈ చర్చల ద్వారా సాధించి పెట్టింది, పరిష్కరించింది ఏమీ లేదు. ఆదివారం అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు వెలువడతాయి కనక ఆ తరవాత మాట్లాడుకుందాం అని కేంద్రం దాటవేసింది. ఆనకట్ట మీద తెలంగాణ పోలీసుల, ఆంధ్రప్రదేశ్ పోలీసులను తొలగించి ఆ బాధ్యత కేంద్ర రిజర్వు పోలీసులకు అప్పగించారు. ఈ విషయాలన్నీ ఎలా ఉన్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణలో పోలింగ్ జరగవలసిన ముందు రోజునే ఎందుకు ఎంచుకుందో అంతుపట్టని వ్యవహారం. బహుశా తెలంగాణ పోలీసులు పోలింగ్ సమయంలో భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉంటారని, ఇదే అదునుగా భావించి ఉండవచ్చు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనవసరమైన పరిస్థితిని సృష్టించింది. ఇది అత్యుత్సాహమే. ఈసారి నాగర్జున సాగర్‌లోకి చేరిన నీరు బాగా తగ్గింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాగార్జున సాగర్ కుడి కాలవ ద్వారా ఇప్పటికే ఏడు టీఎంసీల నీరు వినియోగించుకుంది. పైగా గత బుధవారం దాకా సాగర్ ఎడమ కాలవ నీటిని కూడా వాడుకుంది. క్రెస్ట్ గేట్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసింది. మంచినీటి అవసరం సాకుచెప్పి అదనపు నీటిని తరలించింది. వాడుకున్నది రెండు టీఎంసీల నీరే కావచ్చు. రెండు టీఎంసీల నీటిని వాడుకోవాలంటే నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయవలసి వస్తుంది. కిందటేడాది సాగర్ లోకి 1,723 టీఎంసీల నీరు చేరితే అది ఈ ఏడాది 90 టీఎంసీలకే తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో ఉన్న శ్రీశైలంఆనకట్ట నుంచి నీరు వాడుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి పనిఎప్పుడూ చేయలేదు. ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం ఈ దండయాత్ర చేయ డానికి మరో కారణంకూడా ఉందంటున్నారు. తెలంగాణ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు మేలు చేయడం కోసం కావాలనే ఎన్నికల ముందు రోజు ఈ పని చేసిందన్న విమర్శ ఉంది. సాగర్ ఆనకట్ట భద్రతను పోలీసులు చూసుకుంటారని, అందువల్ల ఈ అంశంపై రాజకీయ నాయకులు ఎలాంటి ప్రకటనలూ చేయకూడదని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ చెప్పాల్సి వచ్చింది. ఈ దండయాత్ర కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 28-29 తేదీల మధ్య అర్ధరాత్రి వందలాది మంది పోలీసులను పంపించింది. ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఆనకట్టకు ఉన్న 13వ గేట్ దాకా రావడానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను, సీసీటీవీలను ధ్వంసం చేయడం ఒక ప్రభుత్వం వ్యవహరించవలసిన తీరైతే కాదు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఇలాంటి ఘర్షణ తలెత్తడం ఇది మూడవ సారి. ఇంతకు ముందు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర విభజన తరవాత ఆంధ్రప్రదేశ్‌కు చెందవలసిన భాగాన్ని ఆక్రమించుకుంది అన్న వాదన ఉంది. కారణం ఏదైనా రెండు రాష్ట్రాల పోలీసుల మధ్య ఘర్షణ జరగడమే దారుణం. వర్షాభావం వల్ల తరచుగా నీటి ఎద్దడి, దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడడం కొత్తేమీ కాదు. ఇలాంటి సమయంలో ప్రభుత్వాలు ఎలా స్పందించి ప్రజలను ఆదుకుంటాయన్నదే సమస్య. దాదాపు ఏడేళ్ల కింద దుర్భిక్ష పరిస్థితి ఎదురైనప్పుడు ప్రజలను ఆదుకోవాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టులో స్వరాజ్ అభియాన్ నాయకుడు యోగేంద్ర యాదవ్ ఓ ప్రజాప్రయోజనవ్యాజ్యం దాఖలుచేశారు. అప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్నాటక, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్‌లో తీవ్ర దుర్భిక్షం తాండవించిన సమయంలో ఈ ప్రజాప్రయోజనవ్యాజ్యం దాఖలైంది. ప్రజలను ఆదుకునేలా ప్రభుత్వాలను ఆదేశించాలని ఈ వ్యాజ్యంలో కోరారు. అప్పుడు ఈ కేసు విచారించిన అప్పటి న్యాయమూర్తులు మదన్ బి.లోకూర్, ఎన్‌వీ రమణతో కూడిన ధర్మాసనం మొత్తం వ్యవసాయ రంగ పరిస్థితిపై ప్రభుత్వాలను నిలదీసింది. అప్పుడు కేంద్ర జలవనరుల శాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 91 ప్రధాన జలాశయాల్లో నీటి నిలవ వాటి సామర్థ్యంతో పోలిస్తే 25 శాతమైనా లేదు. ఈ కారణాలు ఎలా ఉన్నప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జల వివాదాలను పరిష్కరించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. పదేళ్లయినా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపకుండా ఉపేక్షించింది. నదీ జలాల పంపిణీపై వివాదాలు చెలరేగుతూనే ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం సర్దుబాటు చేయాలి. ఈ ఉపేక్ష వల్ల నాగార్జున సాగర్ ఆనకట్టపై మళ్లీ వివాదం తలెత్తింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దండయాత్ర వెనక రాజకీయ దురుద్దేశం ఉందని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అంటున్నాయి. నీటి ఎద్దడి వల్ల ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన ఇబ్బంది ఎదురవుతునప్పటికీ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చించుకుని అవగాహనకురావడం అవసరం. కానీ ప్రభుత్వాలే ఏకంగాదాడులకు దిగడంఅనాగరికం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునర్విభజన చట్టం ప్రకారం తన బాధ్యత నిర్వర్తించి ఘర్షణలు నివారించాలి. కేంద్రానికి ఆ ధ్యాసే ఉన్నట్టు కనిపించడం లేదు.

సెల్‌ఫోన్ మత్తులో బాల్యం చిత్తు

టెక్నాలజీ పెరగడమనేది తప్పకుండా మన భవిష్యత్తు తరాలకు ఉపయోగకరమే. ఇంతకు మునుపు ఒక పనికి పదిరోజులు పట్టే సమయం నేడు పది సెకండ్లలో పూర్తవుతోంది. అది అంతే వేగంగా మన పిల్లల, మన వ్యక్తిగత జీవితాల్లోకి కూడా చొరబడి కాలాన్నీ, ఆరోగ్యాన్ని హరించివేస్తోంది. బలిష్ఠమైన భావిభారతపౌరులుగా ఎదగాల్సిన మన పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిసలై బలహీనులవు తున్నారు. ప్రపంచాన్నంతా అరచేతిలో రంగుల్లో వీక్షించడమే జీవితమని భావిస్తూ ఆ వస్తువేమిటో తెలియని బాల్యం నుంచి దానికి చేయిచాస్తున్నారు. టెక్నాలజీతో ప్రపంచమే కుగ్రామమైపోయిందనేకన్నా బాల్యవధకు వెళ్లిందంటే సరిపోతుందేమో. పెద్దవాళ్లే ఫోన్‌ను చేతికందిస్తూ పిల్లలు తమపనులకు అడ్డురాకుండా చూసుకుంటున్నారు.

కరోనా పుణ్యామా అని డిజిటల్ క్లాసుల చదువులతో పిల్లలు సెల్‌ఫోన్‌ను నిత్యావసరంగా వాడుకోవడానికి పెద్దల అంగీకారం సులభమైంది. పిల్లల సంతోషమే ధ్యేయంగా వాళ్లు అడిగిందల్లా ఆన్‌లైన్‌లో కొనిపెడుతూ నాణ్యత చూడకుండా వారి ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. సెల్‌ఫోన్ కన్నార్పకుండా చూడడం వల్ల కంటి రెప్పపాటు తగ్గిపోయి కన్ను తేమను కోల్పోయి పిల్లల్లో కంటిచూపు మందగిస్తోంది. మొబైల్‌లో ఎక్కువ సమయం గడిపే పిల్లలు సాధారణ జీవితంలో జరిగే సంఘటనలను అర్థం చేసుకోలేరు. ఫోన్‌లోని వెలుగుల రేడియేషన్ నిద్రపట్టనివ్వదు. మహారాష్ట్రలోని ఒక గ్రామంలో 18 ఏళ్లలోపు పిల్లలు ఫోన్ వాడకాన్ని నిషేధించారు. ఉపయోగించిన వారికి 200 రూ. జరిమానా కట్టాలని చెప్పి మంచి నిర్ణయం తీసుకున్నారు.

సోషల్ మీడియా, వీడియోగేమ్స్‌కు బానిసలైపోయిన పిల్లలు పక్కనున్న ప్రమాదాలను, మనుషుల కదలికలను, కూడా గమనించకుండా మానవ సంబంధాల ఉనికిని మర్చిపోతున్నారు. అర్థంకాని వయస్సులో పోర్న్‌వీడియోలకు అతి దగ్గరగా వెళ్తూ వింతగా ప్రవర్తిస్తున్నారు. తమకు నచ్చిన వాటినే ఎక్కువగా చూస్తూ సొంతగా క్రియేటివిటిని కోల్పోతున్నారు. ఒక రకంగా నెట్‌లోనే అన్నీ వెతుక్కునే పిల్లలు బయటి ప్రపంచంలో దేనిమీద ఆసక్తి చూపరు. ఇది వారి భవిష్యత్తు జీవితానికి ప్రమాదకరమ్మైన సంకేతం. పిల్లలు అన్నం తినడం దగ్గరునుండి ఆన్‌లైన్‌లో అన్నీ ఆర్డర్లకు ఫోన్‌మీదనే ఆధారపడడం దురదృష్టం. పిల్లలు పాత తరాలను, బంధుత్వాలను పట్టించుకోకపోయినా ప్రస్తుతంలో అమ్మా, నాన్న మొదలు కుటుంబ సభ్యులంతా ఏదో నాటకంలో వచ్చిపోయే పాత్రధారుల్లా బంధాలను తేలిగ్గా భావిస్తున్నారు.

12 సంవత్సరాలు దాటిన పిల్లలు నలభై శాతానికి పైగా రోజూ 5 గంటలకు పైగా ఈ ఫోన్లతోనే స్మార్ట్‌గా సమయాన్ని నాశనంచేస్తున్నారని అనేక నివేదికలు చెపుతున్నాయి. డెస్క్‌టాప్ కంప్యూటర్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు లేకుంటే జీవితం శూన్యమనే స్థాయిలో ఆలోచిస్తున్నారు. సరదాగా చిన్నతనంలో నలుగురు కలిసి ఆడుకునే ఆట పాటలు మనోవికాసాన్ని, రకరకాల అటలు శరీర ధృఢత్వాన్ని, మంచి స్నేహాలను పెంచుతాయి.

సెల్‌ఫోన్ ముందు గంటలకొద్దీ గడపడం వల్ల రేడియషన్ ప్రభావంతో కళ్లు, మెడ, మెదడు ప్రభావితమై మానసికంగాను, శారీరకంగాను బలహీనమై హిస్టీరియా పేషంట్ల లాగా తయారై ఫోన్ వాడకం నిషేధించిన పెద్దలమీద దాడులకు దిగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. 'మొక్కై వంగనిది మానై వంగునా" అన్నట్లు బాల్యం నుంచి వాళ్లను ఒక క్రమశిక్షణకు అలవాటు చేయకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. టెక్నాలజీ పరంగా మారుతున్న సౌకర్యాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో అవగాహన కల్పించి విలువైన సంప్రదాయ పద్ధతుల్లో వారిని పెంచవలసిన బాధ్యతను తల్లిదండ్రులు విస్మరిస్తే రేపటి తరంలో మానవత్వమున్న మనుషులే కనపడరు.

– జోస్యుల వేణుగోపాల్, సెల్. 9440436806

ఈ ద్వేషభక్తి గేయం: దేశానికి చేస్తున్న గాయం

డాక్టర్ దేవరాజు మహారాజు

ఈ దేశంలోని ప్రతిపౌరుడూ తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి- 1931లో విప్లవవీరుడు భగత్‌సింగ్ పక్షాన తీవ్రంగా వాదించిన న్యాయవాది - ఆసిఫ్ అలీ. భగత్‌సింగ్‌ను శిక్షించడానికి నిరాకరించి, తన జడ్జి పదవికి రాజీనామా చేసిన జస్టిస్ సయ్యద్ ఆగా హైదర్. ఇకపోతే భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధించిన జడ్జి రాయ్- సాహిబ్ పండిట్ శ్రీక్రిషన్ నరనరాన ఆరెస్సెస్ భావజాలంనింపుకున్న వ్యక్తి. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత, లేదా గుర్తు చేసుకున్న తర్వాత ఎవరు దేశభక్తులు, ఎవరు దేశ ద్రోహులు అనే విషయం విజ్ఞత గల ఈ దేశ పౌరులు పూర్తిగా అర్థం చేసుకుంటారు. ముస్లిం అయినంత మాత్రాన ద్వేషించాలని, హిందువులంతా బంధువులేనని అనుకోక తప్పదా? భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది ఎవరు? పాల్గొనని వారెవరు? తెలుసుకోనక్కరలేదా? ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు ప్రచారం చేస్తున్న విద్వేష భక్తి గేయాలు పాడుకోవల్సిందేనా? నిజానిజాలు తెలుసుకునే పనిలేదా? మండిపోతున్న మణిపూర్ లాగా దేశమంతా కావల్సిందేనా? గౌరవనీయులైన మూర్ఖుల సంఖ్య పెరుగుతున్నప్పుడు, సామాన్య పౌరులు తమ వివేకాన్ని నిద్ర లేపాలి. ప్రతి చిన్న విషయాన్నీ హేతుబద్ధంగా విశ్లేషించుకుంటూ ముందుకు సాగాలి. మనది ప్రజాస్వామ్య దేశం! మనుషులంతా ఒక్కటి!! ఈ రెండు విషయాలకు కట్టుబడి మాత్రమే- నిజాయితీగా నిబద్ధతతో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

తాము సనాతన ధర్మాన్ని గౌరవించే వారిమని, దాన్ని వ్యతిరేకించే వారి వ్యాఖ్యలు తమ మనోభావాల్ని గాయపరుస్తున్నాయని, ఆ వ్యాఖ్యలు చేసేవారిని కఠినంగా శిక్షించాలని మాజీ న్యాయమూర్తులు, మాజీ ఉన్నతాధికారులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అలాంటి లేఖ రాసిన వారికి అసలు సనాతనమంటే ఏమిటన్నది అవగాహన ఉందా లేదా అని అనుమానం వస్తుంది. సనాతనమంటే- అసమానత, సనాతనమంటే - అస్పృశ్యత, సనాతనమంటే- కుల వివక్ష, సనాతనమంటే- బలులు, యజ్ఞయాగాలు, బాల్య వివాహాలు, సతీ సహగమనం, దళితుల సజీవ దహనం, సనాతనమంటే- సమాజపు సగభాగపు అణచివేత, ఆధిపత్య హింస, శ్రామికుల పీడన. సనాతనమంటే- నిచ్చెన మెట్ల వ్యవస్థ. సనాతనమంటే- వర్తమానాన్ని గతం అజమాయిషీ చేయడం, సనాతనమంటే- భవిష్యత్తుకు అవరోధం. ఏ కొందరి మనోభావాలో దెబ్బతింటాయంటే, వారు తప్పక వారి ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంటుంది. పైన చెప్పినవన్నీ నిజాలే కదా? నిజాలు కాదు, అబద్ధాలు అని- ఎవరైనా నిరూపించదలిస్తే నిరూపించిన తర్వాత మాట్లాడాలి. సమకాలీనంలో కూడా సనాతనం చేసే అనర్థాలెలా ఉంటాయో చూడండి. ఎప్పుడో మొదలైన కుంభమేళాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి కదా?

1760-హరిద్వార్ కుంభమేళాలో శైవులైన గోసాయిన్లకు వైష్ణవులైన బైరాగులకు మధ్య కలహాలు చెలరేగి రెండువైపులా వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. మరాఠా పీష్వాల నాటి ఒక రాగి ఫలకం- మరి కొన్ని భయంకరమైన విషయాలు వెల్లడించింది. 1789లో నాసిక్ కుంభమేళా లో సుమారు 12 వేల మంది మరణించారు. కారణం శైవులు- వైష్ణవులు హోరాహోరీగా పోట్లాడుకుని, కోపాలు, రోషాలు చల్లారక చంపుకోవడం వరకు వెళ్లింది. మేమంటే మేం- ముందు స్నానం చేయాలని గొడవపడి, అది పెద్దదై శత్రువుల్లాగా ఒకరినొకరు చంపుకున్నారు. ఉభయ పక్షాల వారు కలిసి మొత్తం 12 వేల మంది పుణ్యస్నానాల పేరుతో ప్రాణాలు త్యాగం చేశారు. మతం పిచ్చి తలకెక్కితేఅంతే! అలాగే మరికొంతకాలానికి 1796- హరిద్వార్ కుంభమేళాలో మరోసారి హింస చెలరేగింది. ఉవులకు, ఉదాసీలకు మధ్య సామాను రవాణాకు సంబంధించి, వారి వారి హక్కులకు సంబంధించి సహనం కోల్పోయిన భక్తులు యుద్ధవీరులైపోయారు. భక్తులు మానవత్వంమీద చెరగని మచ్చలుగా మిగిలారు తప్పితే, మత కలహాలతో ఎవరైనా ఎప్పుడైనా ఏమైనా పొందగలిగారా?

లోక కల్యాణం గురించి, ప్రశాంత జీవన మార్గం గురించి, సత్ప్రవర్తన గురించి జనానికి బోధలు చేసే సన్యాసులు, సాధువులు, బైరాగులు యుద్ధాలకు దిగడం ఏమైనా బావుందా? అంటే వారు- సర్వసంగ పరిత్యాగులుగా వేషం మార్చారేగాని, తమలోనిఅహాన్ని జయించలేకపోయారని మనకు అర్థమౌతుంది. అలాంటి వారి నుంచి సామాన్యులు నేర్చుకునేది ఏముంటుందీ? వారిని అని లాభం లేదు. సామాన్యులే వాస్తవాలు గ్రహించాలి. అలాంటి సన్యాసులు దొంగ యోగులు సమాజానికి కాదు కదా, వారికి వారే ఉపయోగంలేనివారు. అలాంటి వారిని సామాన్యులు నమ్మకూడదు. వారి బూటకపు ఆధ్యాత్మికతకు ప్రభావితులు కాకూడదు. అలాంటి వారిని దూరం పెట్టాలి. సమాజ శ్రేయస్సుకు పాటుపడిన మహనీయుల గూర్చి తెలుసుకుంటూ ఉండాలి. వారి మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. దైవమే లేనప్పుడు దైవం పేరు చెప్పి, సంస్కృతి సంప్రదాయాల పేరు చెప్పి, మోసం చేసేవారిని నమ్మడం అవసరమా? ఆలోచించాలి కదా? మన దేశంలో పరిస్థితి ఎలా ఉందంటే పెళ్లాన్ని చంపినోడు సద్గురువు అయ్యాడు. పెళ్లాన్ని వదిలేసినోడు విశ్వగురువు అయ్యాడు. చిన్న విషయం కూడా నేర్చుకుందామన్న తపన లేనోళ్లంతా ఈ దేశంలో గురువులు కావాలని తహతహలాడుతుంటారు. అసలైతే వేలిముద్ర గాడు, కానీ బింకంగా పరీక్షలపై చర్చ అంటూ వచ్చి కూర్చుంటాడు.

"అలి నేలలేని అసమర్దుడెట్లౌను/ ప్రజలనేల గల్గు ప్రాజ్ఞవరుడు?/ ప్రాకలేని బుడత పరుగెత్త నేర్చునా/ వాస్తవమ్ము నార్ల వారి మాట"- అని అన్నారు తెలుగు కవి, రచయిత, ప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు- చాలా కాలం కిందట! ఇప్పుడీ విషయమే రివర్స్‌లో చూస్తున్నాం. ఆలినేలుకో లేనివాడు దేశాన్ని ఏలుతున్నానన్న భ్రమలో బతుకుతున్నాడు. ఉదాహరణకు 2014లో రూపాయికి డాలర్ మారకం విలువ 60.99 అదే 2023 లో 83.15 అయ్యింది. పరిస్థితి ఇలాస్పష్టంగా కనిపిస్తూ ఉంటే ప్రధాని, ఆయన సహచరులంతా దేశం ఆర్థిక ప్రగతి సాధించిందని దబాయిస్తారెందుకూ? వారికెవ్వరికీ కళ్లూ, చెవులూ పని చేయడం లేదా? అందుకే కాబోలు మణిపూర్‌లో ప్రధాని మోదీ ఫోటోతో పోస్టర్లు వెలిశాయి. దానికింద ఒక వాక్యం ఉంది. "ఈయనకు కళ్లు కనబడవు. చెవులు వినబడవు. ఇక్కడ మా మణిపూర్ మండిపోతున్నా ఆయనకు పట్టదు. విదేశాలకు పారిపోతుంటాడు"- అని!

మోదీ అనేది ఇంటిపేరు కాదు, ఆయన విద్యార్హతలు. మాస్టర్ ఆఫ్ డెవలపింగ్‌ఇండియా- అని ఆయన అనుయాయులు ప్రచారం చేసుకుంటున్నది నిజం. కాని, హైస్కూల్ చదువు పూర్తి చేయనివాడు లోపాయికారిగా ఎం.ఎ డిగ్రీ సంపాదించాడని ఈ దేశ ప్రజలకు తెలుసు. డబ్బు గుప్పించి నమ్మకంగా పడి ఉండేవాణ్ణి రెండుసార్లు ప్రధాని సీట్లో కూర్చోబెట్టిన కార్పొరేట్లకు తెలుసు. అందుకే ఆయన వారికి అతి విధేయుడిగా ఉన్నాడు. బీబీసీ డాక్యుమెంటరీయే కాదు, ప్రపంచ వ్యాప్తంగా 14 అంతర్జాతీయ పత్రికలు ఆయన అసమర్థత గూర్చి పూర్తి వివరాలు వెల్లడించాయి. "కుట్ర చేయడం ఎంత తెలివిగా చేయాలంటే ఎదుటివాడికి ఏ మాత్రం తెలియకూడదు. పైగా తనకు తానుగా వచ్చి కుట్రలో ఇరుక్కోవాలి. బలై, భస్మమైపోవాలి"- అని అన్నాడు విన్సెంట్ చర్చిల్. చర్చిల్ ఎప్పుడో చెప్పిన విషయాన్ని ఈ దేశ ప్రధాని ప్రజల మీద ప్రయోగిస్తున్నాడు. నిజం చెప్పుకోవాలంటే విపక్షాల అనైక్యతవల్ల ఆయన కొనసాగాడుతప్పించి, స్వీయ ప్రతిభతో రాణించింది ఎప్పుడూ ఎక్కడా? గుజరాత్ గాయం, మణిపూర్ గాయం. దేశమంతా గాయాలమయమైపోతోంది. నిజమే! ఈ విషయాలు మాత్రం చరిత్రలో నిలిచిపోతాయి!

దేశం కోసం- ధర్మం కోసం ఈ దేశ ప్రధాని చేస్తున్న అనేక సంస్కరణల్లో గ్యాస్ సిలిండర్ ధర పెంచడం కూడా ఒకటి అని ఆ ఫలానా పార్టీ నాయకులు తెగ ప్రచారంచేస్తున్నారు. వారివాదన ఏమిటో ఎంత సబబుగాఉందో ఆలోచించండి. విషయం మీకే బోధపడుతుంది- సిలిండర్లలో నింపే గ్యాస్ భూమి లోపల నుంచి తీస్తారు. అలా గ్యాస్‌తీయడంవల్ల మొక్కలకు లోపలినుంచి అందాల్సిన ఆక్సీజన్ అందదు. దానివల్ల చెట్లు పెరగవు. సుమారుగా ఒక రాష్ట్రానికి 54 లక్షల సిలిండర్లు అవసరమౌతాయంటే, ఇక దేశం మొత్తానికి ఎన్నికావాలో లెక్కకట్టండి. గ్యాస్ సిలిండర్‌ధర పెంచడంవల్ల, భారం మోయలేక చాలామంది కట్టెలు కొట్టుకోవడానికి అడవికి వెళతారు. వారు అక్కడ శుభ్రమైన గాలి పీల్చుకుంటారు. దానివల్ల మేలు జరిగినట్టే కదా? వంట చెరకు కొట్టి తెచ్చుకుని కట్టెల పొయ్యి మీద వంట చేసుకుంటారు. కట్టెల పొయ్యి వల్ల పొగ వస్తుంది. అంటే, దానివల్ల వాతావరణ సమతుల్యం కాపాడుకోవచ్చు కదా? దానివల్ల మేలు జరిగినట్టే కదా? కట్టెల పొయ్యిమీద వంట చేసుకున్న మన పూర్వీకులు రోగాలు రొష్టులూ లేకుండా ఆరోగ్యంగా ఉండేవారు కదా? కట్టెల పొయ్యిఉపయోగంలో లేనందు వల్లనే ఈ రోజుల్లో రోగాలు నానాటికీ ఎక్కువవుతున్న విషయం అందరూ గ్రహించాలి! ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని, ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసమే మోదీ సిలిండర్ ధర పెంచారు. ఆయన ఏ పని చేసినా దేశంకోసం, ధర్మంకోసమే చేస్తారన్నది ఈ దేశప్రజలు అర్థం చేసుకోవాలి! -"ఫలానా పార్టీవారు చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు దేశ ప్రజలే గ్రహించుకోవాలి! దేశం ఎంత ముందుకు పోతోందన్నది బేరీజు వేసుకోవాలి!!

"దేశమును ప్రేమించుమన్న/మంచి అన్నది పెంచుమన్న"- అన్న గురజాడ అప్పారావు (1862-1915)మనకు తెలుసు. "మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును"- అని అన్నది కూడా ఆ మహానుభావుడే. "చెట్టా పట్టాల్ పట్టుకుని/ దేశస్తులంతా నడవవలెనోయ్/ అన్నదమ్ముల వలెను జాతులు/ మతములన్నియు మెలగవలెనోయ్"- అని ఆశించారాయన. అందుకు వ్యతిరేకమైన భావజాలాన్ని ఇప్పుడు ఒక గుజరాత్ అప్పారావ్ ద్వేషభక్తి గీతం పాడుతున్నాడు. జ్యోతిబసు పేరుతో ఎవరోనాకు ఆ పేరడీ గేయం పంపించారు. అది నా పాఠకులుకోసం ఇక్కడ పొందుపరుస్తున్నాను. "మతమునే ప్రేమించుమన్న/ హింసయన్నది పెంచుమన్న/ వట్టి మాటలు చెప్పుకోవోయ్/ చేయు మేలుని కట్టిపెట్టోయ్/ దేశాభిమానమె నాకె కద్దని/ వట్టి గొప్పలె చెప్పుకోవోయ్/ దేశమంటె జనం కాదోయ్/ దేశమంటే మతం మయ మోయ్// హిందుమతమె రాజ్యమేలగ/ దారిలో నువు పాటుపడవోయ్/ తతిమ జాతులు మతములన్నీ/ అణిగి మణిగీ మెలగవలెనోయ్// స్వంత లాభమె అంతయను కుని/ ప్రజలనందరి ముంచవలెనోయ్/ జాతి ఆస్తులు కట్టగట్టి/ దత్త పుత్రుల కట్టబెట్టోయ్// విజ్ఞానమంతయు రాతియుగపు/ గ్రంథమయమని బొంకవలెనోయ్/ రోదసీ నౌకకి సైతం/ దిష్టి టెంకాయ్ కొట్టవలెనోయ్// అంబేద్కరు గాంధీ ఇజాలకు/ పైపై దప్పు కొట్టవలెనోయ్/ మత సామరస్యం చావు కోసం/ లోనగోతులు తీయవలెనోయ్"- అధికారంలో ఉన్నవారు పాడుతున్న ఈ ద్వేషభక్తి గేయం దేశానికి ఎంతగా గాయం చేస్తుందో... సామాన్య పౌరులు అర్థం చేసుకోవాలి! భారత్ జోడో- నఫ్రత్ ఛోడో! భారతదేశ సమగ్రతను కాపాడదాం! విద్వేష భావాన్ని విడనాడుదాం!!' ఇదే నేటి మన కర్తవ్యం.

సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

వన్నె తగ్గని పుస్తకం

విశాలాంధ్ర పుస్తక మహోత్సవానికి విశేష ఆదరణ

డాక్టర్. సీ.ఎన్ క్షేత్రపాల్ రెడ్డి

అభ్యుదయ, ప్రగతిశీల సాహిత్య ఉద్యమాన్ని తెలుగునాట విస్తరింప చేయడంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ నిర్వహిస్తున్న పాత్ర విశేషమైంది. తెలుగువారి సాంస్కృతిక జీవితంలో విశాలాంధ్ర మమేకమైంది. ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించడం కోసం, సమ సమాజ నిర్మాణ లక్ష్యం దిశగా కదులుతున్న అక్షరాలకు వాహకంగా నిలుస్తోంది. పుస్తకం అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడిందని ప్రచారం జరుగుతున్న నేటి ఎలక్ట్రానిక్ యుగంలోనూ అచ్చు పుస్తకాలకు సాటి మరేదీ ఉండదని నిరూపిస్తోంది. తొలి దశలోనే నవయుగ వైతాళికులైన గురజాడ, గిడుగు రామ్మూర్తి పంతులు రచనలను ప్రచురించింది. అఖిల భారత స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన రాహుల్ సాంకృత్యాయన్, కిషన్ చందర్ వంటి ప్రముఖుల రచనలను వెలుగులోకి తెచ్చింది. సోవియట్ యూనియన్ నుంచి అందుతున్న సాహిత్యాన్ని పాఠకులకు అందిస్తూ మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాలను వ్యాప్తి చేసింది. కందుకూరి, శ్రీశ్రీ, తాపీ ధర్మారావు, ఆరుద్ర, కొడవటిగంటి, రావి శాస్త్రి వంటి ముందు తరం రచయితలు, విమర్శకుల వర్తమాన రచయితల కథలు, నవలలు, విమర్శ ఇతర సాహిత్య పుస్తకాలను ప్రజల చెంతకు చేరుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న మార్క్సిజం దివిటీ వెలుగుల్ని వివిధ భాషల నుంచి అనువదించి అందిస్తూ పుస్తకమంటే సమాజ హితాన్ని ఆకాంక్షిచేదని నిరూపిస్తోంది. అభ్యుదయ మార్గమే సమాజాన్ని ఉన్నతీకరిస్తుందన్న విశ్వాసంతో ఏన్నో ఆటుపోట్లను భరిస్తూ, అధిగమిస్తూ విశాలాంధ్ర చేస్తున్న యజ్ఞానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. 1953లో ఏర్పాటైన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో బుక్ షాపులను నిర్వహిచడంతో పాటు ప్రత్యేకంగా ప్రచార రథాలను ఏర్పాటు చేసుకుని మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు కూడా పుస్తక పరిమళాలను వ్యాపింప చేస్తోంది. ఇందులో భాగంగానే విశాఖపట్నంలో నవంబరు 25 వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన ప్రత్యేకత సంతరించుకుంది. 2002 నుంచి వరుసగా విశాలాంధ్ర విశాఖ పుస్తక మహోత్సవం పేరిట క్రమం తప్పకుండా పుస్తక ప్రదర్శనల్ని నిర్వహిస్తూ ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాలకు చెందిన సాహిత్య వేత్తల్ని, పుస్తక ప్రియుల్ని ఆకర్షిస్తోంది. విశాఖ నగరం, జగదాంబ కూడలికి సమీపంలోని టర్నర్ చౌల్ట్రీలో ఏర్పాటైన ఈ పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో ప్రత్యేకంగా అభ్యుదయ రచయిత సంఘం విశాఖ జిల్లా సమితి నగరంలోని వివిధ సాహిత్య, సాంస్కృతి సంస్థలను కలుపుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రతి రోజు కొత్త పుస్తకాల ఆవిష్కరణలతో పుస్తక ప్రదర్శన ప్రాంగణం కాంతులీనుతోంది.

విశాలాంధ్ర పుస్తక మహోత్సవం జరుగుతున్న విషయం తెలుసుకుని మిత్రులతో కలసి విజయనగరం నుంచి వచ్చాను. నేటి కంప్యూటర్ యుగంలోనూ ఈ తరహా పుస్తక మహోత్సవాన్ని క్రమం తప్పకుండా నిర్వహించడం చాలా అరుదు. లాభాపేక్ష లేని సంస్థ కాబట్టే ఎన్ని ఇబ్బందులున్నా విశాలాంధ్ర ప్రచురణాలయం తన వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తోంది. సమాజంతో సాహిత్యానికి విడదీయలేని అనుబంధం ఉంటుంది. విభిన్న రకాలైన పుస్తకాలు మమ్మల్ని ఆకర్షిస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు ఉపయుక్తమైన పుస్తకాలను ప్రదర్శనకు పెట్టడం హర్షణీయం.

ఆర్ సత్యనారాయణ, విజయనగరం.

గత 40 ఏళ్లుగా విశాలాంధ్రతో నాకు అనుబంధం ఉంది. 30 ఏళ్లుగా విశాఖలోని విశాలాంధ్ర బుక్ హౌస్ నిత్యం సందర్శిస్తున్నాను. తెలుగు భాషా చరిత్ర, తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు సాహిత్య విమర్శ, ఆధునిక భాషా శాస్త్రం మొదలైన నా గంథ్రాలను విశాలాంధ్ర సంస్థ ప్రచురించింది. విశాలాంధ్ర సంస్థ అక్షరానికి చేస్తున్న సేవ సామాన్యమైంది కాదు. సాహిత్య సేవ అమోఘమైంది. పుస్తక ప్రదర్శన ముగిసే వరకూ ప్రతి సాయంత్రం ఆ ప్రాంగణంలోనే సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొంటూ కొత్త తరానికి పుస్తకాల గొప్పతనాన్ని వివరిస్తుండడం ఆనందాన్నిస్తోంది.

-ఆచార్య వెలమల సిమ్మన్న

విశాలాంధ్ర పుస్తక మహోత్సవాలను విశాఖపట్నంలో గత 22 ఏళ్లుగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తున్నాం. సాహిత్యంతో, రచయితలతో, పాఠకులతో విశాలాంధ్రకున్న అనుబంధం విడదీయలేనిది. ఈ ఏదాది 40 వేల రకాల పుస్తకాలతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశాం. పాఠకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో గతం కన్నా భిన్నంగా ఈ సారి మూడు వారాల పాటు ఈ మహోత్సవాలను నిర్వహిస్తున్నాం. ప్రత్యేకంగా యువకులతో పాటు పెద్దలు తమ కుటుంబ సభ్యులతో కలసి పుస్తక ప్రదర్శనను చూడడానికి వస్తున్నారు. చిన్నారులకు పుస్తక పఠనం పట్ల జిజ్ఞాస కలిగించేలా ప్రోత్సహిస్తున్నారు.

-బీ పి ఏ రాజు, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్

జమ్ముకశ్మీర్, పుదుచ్చేరి కోసం పార్లమెంటులో 'మహిళా కోటా' బిల్లు

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశంలో మహిళా రిజర్వేషన్ చట్టంలోని నిబంధనలను కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, జమ్ముకశ్మీర్‌కు వర్తింపజేసే బిల్లులను కేంద్రం ప్రవేశ పెట్టబోతోంది. రాజ్యాంగంలోని నిబంధన ఉంది కాబట్టే కేంద్ర పాలిత ఢిల్లీని మహిళా రిజర్వేషన్ బిల్లులో చేర్చినట్లు న్యాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తెలిపారు. పార్లమెంటు సమావేశాలకు ముందు నిర్వహించిన అఖిలపక్ష భేటీలో ఓ ప్రశ్నకు మేఘవాల్ స్పందించారు. ఈ చట్టం పరిధిలోకి కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్ముకశ్మీర్, పుదుచ్చేరిని తెచ్చే నిబంధనలు ఏమీ లేవు కాబట్టే వేర్వేరు బిల్లులను సభ ముందుర ఉంచనున్నట్లు తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, 2023ని ఈసారి ప్రవేశపెట్టి పార్లమెంటు ఆమోదం పొందాలని సర్కార్ భావిస్తోంది. అలాగే జమ్ముకశ్మీర్ శాసనసభలో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వు చేసేలా జమ్ము, కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2023ని తీసుకురానున్నది. సెప్టెంబరులో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లుకు ఆమోదం లభించింది. 'నారీశక్తి వందన్ అధినియం' చట్టం అమలునకు కొద్ది సమయం పడుతుందని ప్రభుత్వం పేర్కొనడం విదితమే.

ప్రజలపై నమ్మకం ఉంది: కమల్‌నాథ్

భోపాల్: తాను ఏ ఎగ్జిట్ పోల్స్‌ను పట్టించుకోనని, మధ్యప్రదేశ్ ఓటర్లపై తనకు నమ్మకం ఉందని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం జరగనున్న నేపథ్యంలో ఎగ్జిట్ పోల్ ఫలితాలపై ఆయన స్పందించారు. రాష్ట్ర రాజధాని భోపాల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎగ్జిట్ పోల్స్‌లో అత్యధికం బీజేపీకే మొగ్గుచూపాయి. కొన్ని ఎగ్జిట్ పోల్స్ మాత్రం కాంగ్రెస్ గణనీయ స్థానాలు సాధిస్తుందని అంచనా వేశాయి. ఈ ఎగ్జిట్ పోల్స్‌పై కమల్‌నాథ్ మాట్లాడుతూ తాను ఏ ఎగ్జిట్‌పోల్ గురించి పట్టించుకోనని, మధ్యప్రదేశ్ ఓటర్లపై తనకు నమ్మకం ఉందన్నారు. ఇక స్వతంత్ర అభ్యర్థులతో కాంగ్రెస్ పార్టీ టచ్‌లో ఉందా అనే ప్రశ్నకు బదులిస్తూ అలా చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇదిలా ఉండగా కనీసం 140 సీట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఇండోర్-1 నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శుక్లా విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి కైలాశ్ విజయవర్గియాదే పైచేయిగా ఎగ్జిట్ పోల్ ఫలితాలలో వచ్చినప్పటికీ ఆయన దేశానికి బలమైన నాయకుడు అవుతాడేమో కాని తన అసెంబ్లీ నియోజకవర్గానికి కాదని, అక్కడ తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

పూర్తి మెజార్టీ మాదే: సింధియా

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లో బీజేపీ పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో సింధియా శనివారం గ్వాలియర్‌లో విలేకరులతో మాట్లాడారు. 24 గంటలు ఆగండి.. ఫలితాలు మన ముందే ఉంటాయని సింధియా చెప్పారు. ఇంతకుముందు మాట్లాడిన ముఖ్యమంత్రి, బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా భారీ మెజారిటీతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీకి రాష్ట్రంలోని అన్ని వర్గాల నుంచి మద్దతు లభించిందని, అత్యధిక మెజారిటీతో ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని సీఎం చెప్పారు.

ఈడీకి స్టాలిన్ సర్కారు షాక్

చెన్నై: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి తమిళనాడు ప్రభుత్వం షాకిచ్చింది. దిండిగల్ జిల్లాలోని ఓ ప్రభుత్వ డాక్టర్ నుంచి రూ.20 లక్షలు లంచం తీసుకున్నందుకు మధురై జోన్ ఈడీ అధికారి అంకిత్ తివారీని తమిళనాడు విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈడీ అధికారి అరెస్టు రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపింది. డీఎంకే, బీజేపీ పరస్పర మాటల దాడికి దిగాయి. ఈడీ అంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కాదని, ఎక్స్‌టార్షన్ డిపార్ట్‌మెంట్ అని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ట్విట్టర్‌లో ఎద్దేవా చేశారు. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని ఈడీని బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ఈడీపై ఎంపీ దయానిధి మారన్ ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఒక్క అధికారి తప్పు చేస్తే మొత్తం ఏజెన్సీనే తప్పు పట్టడం సరికాదని పేర్కొంది. ఈడీ అధికారి అమాయకుడైతే విజిలెన్స్ పోలీసులు వచ్చినప్పుడు ఎందుకు పారిపోయాడని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి ప్రశ్నించారు.

కొత్తగా 88 కరోనా కేసులు

న్యూఢిల్లీ: గతంలో కరోనా వైరస్ విజృంభణతో దేశం అతలాకుతలమైంది. లక్షల మంది మృత్యువాత పడ్డారు. వ్యాక్సినేషన్ తర్వాత కొంత ఉపశమనం లభించింది. కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. అయితే ఈ మహమ్మారి ఇంకా మన మధ్య నుంచి పోలేదు. భారత్‌లో కొత్తగా 88 కరోనా కేసులు నమోదయ్యాయి. 396 మంది కరోనా బాధితులు చికిత్స పొందుతున్నారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటివరకూ కరోనా కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 5,33,300. కరోనా సోకిన వారి సంఖ్య 4,50,02,103. మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం కరోనా నుండి కోలుకున్న వారి సంఖ్య 4,44,68,407కు పెరిగింది. దేశంలో కరోనా నుండి కోలుకున్నవారి శాతం 98.81 కాగా, మరణాల రేటు 1.19 శాతం. దేశంలో ఇప్పటివరకు మొత్తం 220.67 కోట్లకు పైగా కోవిడ్ -19 వ్యాక్సిన్‌లు అందించారు. సిమ్లాలోని ఇందిరాగాంధీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (ఐజీఎంసీ)లో కరోనా పాజిటివ్‌తో మహిళ మృతి చెందింది.

విమానం ఆలస్యం... ప్రయాణికుల ఆందోళన

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి పాట్నాకు వెళ్లాల్సిన విమానం ఏడు గంటల ఆలస్యంగా విమాశ్రయానికి రావడంపై ప్రయాణికులు మండిపడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయంలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే...స్పైస్‌జెట్‌కు చెందిన విమానం ఢిల్లీ నుంచి పాట్నాకు బయలుదేరాల్సి ఉంది. విమానం ఎంతకీ రాకపోవడంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంపై అక్కడి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో విమాశ్రయంలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన ఎయిర్‌పోర్టు అధికారులు ప్రయాణికులతో మాట్లాడి పరిస్థితిని అదుపు చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. అయితే, విమానం ఆలస్యం కావడంపై ఎయిర్‌లైన్స్ స్పందించింది. నిన్న రాత్రి షెడ్యూల్‌లో మార్పులు చేయాల్సి వచ్చిందని, ఆలస్యంపై ముందుగానే ప్రయాణికులకు తెలియజేశామని, దీని ప్రకారం తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని కోరామని ఓ ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా ఇటీవల హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం మూడు గంటలకు పైగా ఆలస్యమైంది. దీంతో సహనం కోల్పోయిన ప్రయాణికులు ధర్నాకు దిగారు. సాంకేతిక లోపం కారణంగా సర్వీస్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల కోసం మరో విమానం ఏర్పాటు చేశారు.

మావోయిస్టుల మందుపాతరలో ఇద్దరికి గాయాలు

చింతూరు: చత్తీస్‌గఢ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందురోజు మావోయిస్టులు హింసకు పాల్పడ్డారు. పోలీసులే లక్ష్యంగా మందుపాతర పేల్చారు. బర్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు శనివారం మధ్యాహ్నం ఐఈడీ బ్లాస్ట్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. చాలామందికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు దంతెవాడ పోలీసులు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు ఒకరోజు ముందు ఈ ఘటన జరగడంతో అందరూ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా నవంబరులో తొలి దశ ఎన్నికల పోలింగ్ సమయంలో చత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని తొండమర్క ప్రాంతంలో మావోయిస్టులు ఇదే తరహా ఘటనకు పాల్పడ్డారు. ఐఈడీ పేలుడులో సీఆర్‌పీఎఫ్ కోబ్రా బెటాలియన్‌కు చెందిన ఒక జవాన్ గాయపడ్డారు. చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడతలో కుంట అసెంబ్లీ నియోజకవర్గానికి నవంబర్ 7న పోలింగ్ జరిగింది. ఎన్నికల విధుల కోసం నియమించిన సీఆర్పీఎఫ్ జవాన్‌లను లక్ష్యం చేసుకుని ఆనాడు మావోయిస్టులు మందుపాతర పేల్చారని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు.

కపట కాషాయం కసరత్తు

- స్వతంత్రులు... చిన్న పార్టీలపై కన్ను
- రాజస్తాన్‌లో అధికారమే పరమావధిగా ఎత్తులు

జైపూర్ : కాషాయ పార్టీ బీజేపీ అధికారమే పరమావధిగా రాజ్యాంగ, ప్రజాస్వామ్య విరుద్ధ కుట్రలకు కసరత్తు ప్రారంభించింది. రాజస్తాన్‌లో స్వతంత్రులు... చిన్న పార్టీలపై దృష్టిసారించింది. ఇక పార్టీ టికెట్లు నిరాకరించడంతో తిరుగుబాటు చేసిన వారిని కూడా బుజ్జగించి, వారినీ తమ ఖాతాలోకి వేసుకునేందుకు సకల యత్నాలు ప్రారంభించింది. ఎడారి రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నడుమ ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలనే కుట్రలకు కమలం పార్టీ తెరలేపింది. రాష్ట్రంలో ఓటరు తీర్పు అస్పష్టంగా వస్తుందన్న ఊహాగానాల నేపథ్యంలో బీజేపీ టికెట్లు నిరాకరించిన కొంతమంది స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థులకు గాలం వేసేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో 40 స్థానాల్లో పార్టీ తిరుగుబాటుదారులు, బలమైన స్వతంత్రులు లేదా మూడవ పార్టీ అభ్యర్థులు ఉన్న ఈ స్థానాలు ఎన్నికల ఫలితాలను రూపొందించడంలో కీలకమైనవి. ఈ స్థానాలపై గణనీయమైన దృష్టి సారించి, స్వతంత్రులు, తిరుగుబాటుదారులలో విజేతలను ఆకర్షించడానికి వ్యూహ రచన చేస్తోంది. ఎన్నికల లెక్కల్లో వ్యూహాత్మకంగా ఉన్న స్వతంత్రులు, తిరుగుబాటుదారులతో పొత్తులు పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. 20 స్థానాల్లో ప్రాంతీయ పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్, బీజేపీ రెండింటి నుంచి తిరుగుబాటుదారులు ఉన్నారు. మెజారిటీ రాకపోతే గెలిచిన స్వతంత్రుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై దృష్టి సారించింది. ఆదివారం ఫలితాలు వెలువడనుండంతో బీజేపీ చురుగ్గా వ్యూహం రచిస్తోంది. ఇప్పటివరకు సంప్రదించిన వ్యక్తుల జాబితాలో 'తిరుగుబాటు' అభ్యర్థులు రవీంద్ర, చంద్రభాన్ సింగ్ అఖ్య, రోహితాష్ శర్మ ఉన్నారు. స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థులు 6 నుంచి 10 స్థానాల్లో విజయం సాధిస్తారన్న ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. కాగా, భారతీయ ఆదివాసీ పార్టీ, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, బీఎస్‌పీ కలిసి 10 స్థానాలను గెలుచుకుంటారని అంచనా వేస్తుండగా, ఆ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు రాజస్థాన్‌లో బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ ప్రహ్లాద్ జోషి తెలిపారు. ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు రాజేంద్ర రాథోడ్, ఆయన డిప్యూటీ సతీష్ పూనియా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే రేసులో కొంత మంది స్వతంత్రులు, కొన్ని పార్టీల అభ్యర్థులను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. టికెట్లు నిరాకరించినప్పటికీ నేరుగా సవాలు చేయని తిరుగుబాటు అభ్యర్థులే మొదటి వరుసలో పడతారని బీజేపీ అంచనా వేస్తోంది. 'అఖ్య, భాటి వంటి స్వతంత్రులు ఎప్పుడూ కేంద్ర పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు. వాస్తవానికి, అఖ్య ఎప్పుడూ ప్రధాని నరేంద్ర మోదీపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన ప్రచారంలో కూడా ప్రజలు ఆయనను బీజేపీ సైనికుడిలా చూశారు' అని పార్టీ నాయకుడు ఒకరు చెప్పారు.

షెకావత్ రాష్ట్రంలోని పశ్చిమ ప్రాంతం నుంచి స్వతంత్ర అభ్యర్థులకు చేరువవుతున్నారు. 'తాము పోటీ చేసిన సీట్లలో గెలిచే అవకాశం ఉన్న కనీసం ఐదుగురు అభ్యర్థులతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నాడు. ఆయన ప్రచారంలో పాత్ర పోషించాడు' అని షెకావత్ సన్నిహితుడు ఒకరు చెప్పారు.

మోదీ పాలనలో రైల్వేలు ధ్వంసం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే ధ్వజం

న్యూఢిల్లీ : రైల్వేలను ధ్వంసం చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏ అవకాశాన్నీ వదిలిపెట్టలేదని ఆరోపిస్తూ, తాజా రైల్వే పనితీరు నివేదికపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే శనివారం విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ కొత్త రైళ్లకు జెండా ఊపి, సామాన్య ప్రజల భద్రత, సౌలభ్యం, ఉపశమనాలపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. 'రైల్వేలను నాశనం చేయడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టలేదు!' అని ఖడ్గే 'ఎక్స్' పై హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'బాలాసోర్ వంటి పెద్ద ప్రమాదాల తరువాత బాగా ప్రచారం చేయబడిన 'కవచ్' ఒక్క కిలోమీటరు రక్షణను కూడా కల్పించలేదు' అని ఆయన ఆరోపించారు. సాధారణ స్లీపర్ క్లాస్‌లో రైలులో ప్రయాణించడం చాలా ఖరీదైనదని, స్లీపర్ కోచ్‌ల సంఖ్యను కూడా తగ్గించారని పేర్కొన్నారు. ఈ ఏడాది 10 శాతానికి పైగా రైళ్లు షెడ్యూల్ సమయానికంటే ఆలస్యంగా నడిచాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. 'రైల్వే బడ్జెట్‌ను రద్దు చేయడం ద్వారా మోదీ ప్రభుత్వం తన జవాబుదారీతనం నుంచి దూరంగా వెళ్లిపోయింది. మోదీజీ కేవలం ప్రశంసలు పొందడం కోసం తెల్ల రంగులతో కూడిన రైళ్లను ప్రారంభించే విన్యాసాలలో బిజీగా ఉన్నాడు' అని ఎద్దేవా చేశారు. 'కానీ సామాన్య ప్రజల భద్రత, సౌకర్యం, సౌలభ్యం, ఉపశమనాలపై ఆయన శ్రద్ధ చూపడం లేదు' అని అన్నారు. ఇదిలాఉండగా, 1,500 కిలోమీటర్ల రైలు మార్గంలో దేశీయంగా అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్'ను పూర్తిగా ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం తెలిపారు. దీని పరిధిని పెంచే విషయంలో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. రైలు ప్రయాణికుల సంఖ్య తగ్గలేదని, ఆర్థిక సంవత్సరం చివరి నాటికి భారతీయ రైల్వేలు కోవిడ్‌కు ముందు ప్రయాణీకుల రద్దీని 650 నుంచి 700 కోట్లకు చేరుస్తాయని మంత్రి వివరించారు. రైలు ప్రయాణీకుల సంఖ్య 2010లో ఉన్న దానికంటే సగానికి పైగా చేరుకుందని సోషల్ మీడియాలో వచ్చిన కొన్ని నివేదికలు, వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత భారతీయ రైల్వే తన రైలు సేవలను డిసెంబరు 2021 నుంచి ప్రారంభించింది. జులై 2022 నాటికి కార్యకలాపాలు సాధారణీకరించబడ్డాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 640 కోట్ల మంది రైల్వేలను ఉపయోగించారని వైష్ణవ్ చెప్పారు. 'ఈ సంవత్సరం మా సాంప్రదాయిక అంచనా ప్రకారం 650 కోట్ల మంది (రైళ్లలో) ప్రయాణిస్తారు. ఈ సంఖ్య 750 కోట్లకు చేరుకోవచ్చు. అందువల్ల రైలు ప్రయాణికుల సంఖ్య సుమారు 700 కోట్ల మంది ఉన్న కోవిడ్ పూర్వ యుగానికి తిరిగి వచ్చాము' అని ఆయన పేర్కొన్నారు. నాన్-ఏసీ కోచ్‌లు లేదా స్లీపర్ క్లాస్ కోచ్‌ల సంఖ్యను తగ్గించినట్లు వచ్చిన వార్తలను కూడా తోసిపుచ్చారు.

టెక్నాలజీ దుర్వినియోగం హానికరం

డీప్‌ఫేక్‌తో సమాజానికి ముప్పు: రాష్ట్రపతి ముర్ము

నాగపూర్: కృత్రిమ మేధస్సు (ఏఐ)తో ప్రజల జీవితాలు సులువు అవుతున్నాగానీ దాని దుర్వినియోగంతో డీప్‌ఫేక్ వంటివి సమాజానికి హానికరంగా పరిణమిస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆందోళన వ్యక్తంచేశారు. సాంకేతికతను సద్వినియోగిస్తే సమాజానికి ప్రయోజనం జరుగుతుందని, దుర్వినియోగిస్తే మానవాళికి ముప్పుగా పరిణమిస్తుందన్నారు. బాలికలకు విద్యాభ్యాసం కల్పించడం దేశ ప్రగతికి విలువైన పెట్టుబడని అన్నారు. రాష్ట్రసంత్ తుకాదోజీ మహారాజ్ నాగపూర్ యూనివర్సిటీ (ఆర్‌టీఎంయూఎన్) 11వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం గురించి యువతకు తెలుసు. దానిని ఎలా వాడుకోవాలన్న అవగాహన వారికి ఉంటుంది. ఏదేని వనరు సద్వినియోగం లేక దుర్వినియోగం కావచ్చు. టెక్నాలజీ కూడా అంతే. ప్రస్తుతం ఏఐ దుర్వినియోగం వల్ల డీప్‌ఫేక్ ద్వారా సమాజానికి ముప్పు వాటిల్లుతోంది. నైతిక విలువలాధిరత విద్య ద్వారానే సరైన మార్గంలో అనుసరించగలం' అని ముర్ము నొక్కిచెప్పారు. పట్టభద్రుల్లో సగానికిపైగా అమ్మాయిలు ఉండటంపై హర్షం వ్యక్తంచేశారు. నాలుగు లక్షల మంది ఈ వర్సిటీ అనుబంధ కళాశాలల్లో చదువుతున్నారని, వీరిలో 40శాతం మంది అమ్మాయిలు ఉండటం సంతృప్తినిస్తోందని అన్నారు. టెక్నాలజీ రంగంలో వచ్చే పెద్ద మార్పులపై అవగాహన మంచిదని, విద్యార్థులకు దీనిపై ఆసక్తి ఉండాలన్నారు. భారతీయ నైతిక విలువలను పెంపొందించడమే జాతీయ విద్యా విధానం ఉద్దేశంగా తెలిపారు. 'విద్యార్థులు సమాజానికి ఆస్తులని, దేశ భవిష్యత్ బాధ్యత వారి భుజాలపై ఉంటుందని ముర్ము అన్నారు. దేశ ప్రగతిలో విశ్వవిద్యాలయాలది కీలకపాత్ర మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవంద్ర ఫడ్నవీస్ అన్నారు.

పంజాబ్ మాజీ మంత్రులు ఇద్దరి ఇళ్లలో ఈడీ సోదాలు

నేరపూరిత పత్రాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ మంత్రులు, కాంగ్రెస్ నేతలు సంధు సింగ్ ధరమ్‌సోట్, సంగత్ సింగ్ గిల్జియాన్ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదా చేశారు. అటవీ కుంభకోణం సంబంధిత మనీలాండరింగ్ కేసులో దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు జరిగాయి. నేరపూరిత పత్రాలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అధికారులు సీజ్ చేశారు. అటవీ శాఖలో బదిలీలు/నియామకాల కోసం లంచం తీసుకోవడంతో పాటు అనేక ఆరోపణలు వీరిపై ఉన్నాయి. ఈ వ్యవహారంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఈడీ శనివారం పేర్కొంది. మాజీ మంత్రులు, వారి సన్నిహితులు, అటవీ అధికారులతో పాటు కొందరు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సోదా చేసినట్లు తెలిపింది. పంజాబ్, హరియాణా, ఢిల్లీలో ఉన్న ఆస్తులను నవంబరు 30న తనిఖీ చేసినట్లు ఈడీ వెల్లడించింది. సంధు సింగ్ ధరమ్‌సోట్ (63) ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. అక్రమాస్తుల కేసులో ఆయనను పంజాబ్ విజిలెన్స్ బ్యూరో అధికారులు ఈ ఏడాదిలో అరెస్టు చేశారు. సంగత్ సింగ్ గిల్జియాన్ హోషియార్పూర్ జిల్లాలోని ఉర్మార్ స్థానానికి ఎమ్మెల్యేగా పనిచేశారు. కాగా తనిఖీల్లో నేరపూరిత పత్రాలు, ఫోన్లు, డిజిటల్ పరికరాలను సీజ్ చేసినట్లు ఈడీ పేర్కొంది. ప్రాథమిక దర్యాప్తులో అనుమానస్పద లావాదేవీలను గుర్తించినట్లు వెల్లడించింది. దీనిపై ఆరా తీస్తున్నట్లు పేర్కొంది.

ఢిల్లీ మద్యం కేసులో సంజయ్ సింగ్‌పై ఈడీ చార్జిషీటు



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసుతో ముడిపడ్డ మనీ లాండరింగ్ కేసులో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌పై శనివారం చార్జిషీటును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)లోని వివిధ సెక్షన్ల కింద స్థానిక కోర్టు ఎదుట ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఇటువంటి ఐదు ఫిర్యాదులను ఈడీ దాఖలు చేయగా ఇది సప్లిమెంటరీ చార్జిషీటు అని అన్నారు. అక్టోబరులో సింగ్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం విదితమే.

భోపాల్ విషాదానికి 39 ఏళ్లు

భోపాల్: భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి నేటికి 39 ఏళ్లు. 1984 డిసెంబర్ 2,3 తేదీల మధ్య రాత్రి జరిగిన ఈ గ్యాస్ లీక్ ఘటనలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ ప్రజలు నాటి ఘటన మిగిల్చిన విషాదాన్ని దిగమింగుతూనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రపంచంలోనే భారీ పారిశ్రామిక దుర్ఘటనగా పేరొందిన భోపాల్ ఉదంతపు గాయాలు 39 ఏళ్లు గడిచినా మానలేదు. ఈ గ్యాస్ దుర్ఘటనలో వేలాది మంది మృతిచెందారు. వారి పిల్లలు, మనుమలు ఇప్పటికీ ఈ విష వాయువు ప్రభావాలను ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రభుత్వాలు అందించిన సాయం ఎందుకూ సరిపోలేదు. గ్యాస్ దుర్ఘటన జరిగిన ప్రదేశంలో విషపూరిత వ్యర్థాలు నేటికీ కనిపిస్తాయి. ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఈ విషపూరిత వ్యర్థాలను కాల్చడం సాధ్యం కావడం లేదు. ఈ దుర్ఘటనకు బలై, న్యాయ పోరాటానికి దిగిన చాలామంది చనిపోయారు. ఈ ఉదంతంలో బాధ్యులను శిక్షించాలనే అంశం ఇంకా కోర్టుల్లో పెండింగ్‌లోనే ఉంది. భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో 15 వేల మందికి పైగా జనం ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం దరిమిలా నగరం మృతదేహాలతో నిండిపోయింది. 1979లో మిథైల్ ఐసోసైనైడ్ ఉత్పత్తి కోసం ఇక్కడ కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ పరిశ్రమ యాజమాన్యం తగిన భద్రతా ఏర్పాట్లు చేయలేదు. డిసెంబర్ 2, 3వ తేదీ రాత్రి ఫ్యాక్టరీలోని ఏ 610 నంబర్ ట్యాంక్‌లో నీరు లీకైంది. మిథైల్ ఐసోసైనేట్‌లో నీరు కలవడంతో ట్యాంకులోపల ఉష్ణోగ్రత పెరిగింది. ఆ తర్వాత విషవాయువు వాతావరణంలోకి వ్యాపించింది. 45 నిమిషాల వ్యవధిలోనే దాదాపు 30 మెట్రిక్ టన్నుల గ్యాస్ లీకైంది. ఈ వాయువు నగరమంతటా వ్యాపించింది. విషవాయువుల బారినపడి 15 వేల మందికి పైగా జనం మృత్యువాత పడ్డారు. అయితే ఈ ప్రమాదం నుంచి బయటపడిన వారు కూడా విష వాయువు ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. వైకల్యం రూపంలో వారిని, వారి తరాలను వెంటాడుతోంది. అధికారిక మరణాల సంఖ్య మొదట్లో 2259గా నివేదించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం 3,787 మంది గ్యాస్ బారిన పడినట్లు నిర్ధారించింది. ఇతర అంచనాల ప్రకారం ఎనిమిది వేలమంది మరణించారు. మరో ఎనిమిది వేల మంది గ్యాస్ సంబంధిత వ్యాధులతో కన్నుమూశారని వివిధ నివేదికలు వెల్లడించాయి.

- మహువా బహిష్కరణపైనా చర్చ
- అఖిలపక్ష భేటీలో ప్రతిపక్షాల డిమాండ్
- అన్ని అంశాలపై నిర్మాణాత్మక చర్చలకు సిద్ధం: సర్కార్

చట్టాలకు హిందీ పేర్లు

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలకు ముందు నిర్వహించే అఖిలపక్ష భేటీలను కాలాన్ని వృథా చేసే సమావేశాలుగా ప్రభుత్వం మార్చిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అఖిలపక్ష సమావేశాలతో సమయం వృథా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండటం లేదని దుయ్యబట్టాయి. చర్చలు జరపకుండా బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెడుతోందని ఆరోపించాయి. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఆధారాల చట్టం స్థానంలో మూడు బిల్లులను ఆమోదించవద్దని సూచించాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యురాలు మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి తొలగించే విషయంలో నైతిక కమిటీ నివేదిక మీద పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ పరిస్థితి, అధిక ద్రవ్యోల్బణం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) దుర్వినియోగం, చట్టాలకు హిందీ పేర్లతో పాటు క్రిమినల్ చట్టాల స్థానె తెచ్చే మూడు బిల్లులపై ప్రధానంగా చర్చను కాంగ్రెస్ సహా విపక్షాలు కోరాయి. మహారాష్ట్రను కుదిపివేస్తున్న మరాఠా, ధంగర్ వర్గాలకు రిజర్వేషన్ అంశంపైనా చర్చ జరపాలన్నాయి. చిన్న పార్టీలకు సభలో మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయించాలి తదితర అంశాలపై చర్చకు డిమాండ్ చేశాయి. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం అఖిలపక్ష సమావేశాన్ని కేంద్రప్రభుత్వం నిర్వహించింది. అన్ని అంశాలపై నిర్మాణాత్మక చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. చట్టసభలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కోరింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో 23 పార్టీలకు చెందిన 30 మంది నాయకులు హాజరయ్యారు. వీరిలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, టీఎంసీ నేతలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓ బ్రెయిన్, ఎన్‌సీపీ నేత ఫౌజియా ఖాన్ తదితరులు ఉన్నారు. టీఎంసీ నేతలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓ బ్రెయిన్ మాట్లాడుతూ మహువా మొయిత్రాను తొలగించాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ నివేదికపై చర్చను డిమాండ్ చేశారు. 'ఇప్పటికే కొందరు ఎంపీలు సస్పెన్షన్‌లో ఉన్నారు. టీఎంసీ సభ్యుల్లో ఒకరిని సస్పెండ్ చేస్తారని మీడియా నివేదికల ద్వారా తెలిసింది' అని అన్నారు. ఈ అంశంపై లోక్‌సభలో చర్చ జరగాలని, అనంతరం నిర్ణయం కూడా తీసుకోవాలని కోరారు. బెంగాల్‌కు పెండింగ్ ఉన్న ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ చెల్లింపులు, నిరుద్యోగం, అధిక ధరలపై చర్చకు డిమాండ్ చేశారు. శివసేన నేత రాహుల్ షీవాలే మాట్లాడుతూ మరాఠా, ధంగర్ వర్గాలకు రిజర్వేషన్ అంశాన్ని చర్చించాలన్నారు. భారత శిక్షా స్మృతి (ఐపీసీ), భారత ఆధారాల చట్టం, నేరపూరిత శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ) చట్టాల స్థానె భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ శిక్ష (బీఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్) క్రిమినల్ చట్టాలకు హిందీ పేర్లు పెట్టడాన్ని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్‌పీ) నేత ఎన్‌కే ప్రేమచంద్రన్, ఏఐఏడీఎంకే నేత ఎం.తంబిదురై వ్యతిరేకించారు. హిందీ పేర్లు పెడితే దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఉచ్చరణ సమస్యవుతుందన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తామని చెప్పారు. తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు, సమస్యలను వివరించేందుకు చిన్న పార్టీలకు అధిక సమయాన్ని కేటాయించాలని జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేత మహువా మాఝీ డిమాండ్ చేశారు. కేవలం మూడు నిమిషాల్లో చెప్పాలనుకున్నది సరిగ్గా చెప్పలేకపోతున్నామని అన్నారు. ఇదిలావుంటే, ఐదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆదివారం రాజస్తాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. వీటి ప్రభావం పార్లమెంటు సమావేశాలపై ఉంటుందన్న అంచనా ఉంది. ఈనెల 4వ తేదీ నుంచి 22 వరకు పార్లమెంటు సమావేశాలు 15 సిట్టింగుల్లో జరగనున్నాయి. పార్లమెంటు వద్ద 37 బిల్లులు పెండింగ్‌లో ఉండగా వీటిలో 12 పరిశీలన, ఆమోదం దశలో ఉన్నాయి. మరో ఏడు ప్రవేశం, పరిశీలన, ఆమోదం దశలో ఉన్నాయి.

పరువు నష్టం కేసులో లాలుకు ఊరట

పాట్నా: పరువు నష్టం కేసులో ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్‌కు ఊరట లభించింది. సరైన ఆధారాలు లేని కారణంగా లాలును నిర్దోషిగా ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సారికా బహాలియా ఈ మేరకు శనివారం ఆదేశాలిచ్చారు. 2017పై లాలుపై ఉదయ్ కాంత్ మిశ్రా పరువు నష్టం దావా వేశారు. శ్రీజన్ కుంభకోణంలో ప్రమేయం ఉన్నట్లు తనపై ఆరోపణలు చేయడం ద్వారా సమాజంలో పరువు తీశారని ఆరోపించారు. లాలుపై కేసును ప్రత్యేక కోర్టు విచారించింది. కోర్టు ఎదుట వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలని అనేకసార్లు మిశ్రాకు ఆదేశాలిచ్చింది. కానీ ఆయన రాలేదు. ఈ కేసులో రాజీపత్రం కూడా దాఖలైంది. సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా యాదవ్‌కు కోర్టు ఊరట కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

సహజ అభ్యుదయ కవి ఆవంత్స

విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో వక్తలు

విశాలాంధ్ర – విశాఖ: సహజ అభ్యుదయ కవిగా ఆవంత్స సోమసుందర్ నిలిచారని, తెలంగాణ ఉద్యమాన్ని కోస్తా ప్రాంతం నుండి సమర్ధించి కవిత్వం వెలువరించిన నిష్పక్షపాత వ్యక్తిత్వం ఆయన సొంతమని వక్తలు అభిప్రాయపడ్డారు. అభ్యుదయ కవితా శిఖరం ఆవంత్స సోమసుందర్ శత జయంతి వత్సర సభ అరసం అధ్వర్యంలో శనివారం సాయంత్రం విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగింది. ముందుగా అడపా రామకృష్ణ రచించిన దేశమేగతి బాగుపడునోయ్ కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించగా ఆచార్య డీవీ సూర్యారావు, కిలారి గౌరినాయుడు, కేవీఎస్ మూర్తి, వెలమల సిమ్మన్న తదితరులు సోమసుందర్ గురించి మాట్లాడుతూ 'వజ్రాయుధం' నుండి 'ఆమ్రపర్ణి' వరకూ సుమారు ఆరున్నర దశాబ్దాల పాటు సోమసుందర్ చేసిన కవితాయానంలో సమాజ సంకుల సమరమే అన్ని కోణాల్లోనూ ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. జాతి చైతన్యాన్ని కవితా చైతన్యంగా సమర్ధవంతంగా చేసిన అభ్యుదయ కవిగా సోమసుందర్ నిలిచారని అభివర్ణించారు. కార్యక్రమంలో సీఎన్ క్షేత్రపాల్‌రెడ్డి, పి.శ్యాంసుందర్, ఎస్.హనుమంతరావు, పీఏ రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం కేసు పెట్టొచ్చా?

సుప్రీంకోర్టు పరిశీలన

న్యూఢిల్లీ: అత్యాచార కేసులో మహిళపై అభియోగాలు నమోదు చేయొచ్చా అనే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించనుంది. ఓ అత్యాచార కేసులో మహిళ దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది. తన కోడలు పెట్టిన అత్యాచార కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న 61 ఏళ్ల మహిళ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు... దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ పంజాబ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మహిళపై అత్యాచార కేసు నమోదు చేయొచ్చా లేదా అనే అంశాన్ని తాము పరిశీలిస్తామని ధర్మాసనం వెల్లడించింది. అంతవరకు పిటిషన్‌దారుకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని ఆమెను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే...పంజాబ్‌కు చెందిన 61 ఏళ్ల మహిళ.. గతేడాది సెప్టెంబరులో తన పెద్ద కుమారుడికి ఓ యువతితో వివాహం జరిపించింది. అప్పుడు ఆమె కుమారుడు అమెరికాలో ఉండగా వర్చువల్‌గానే ఈ పెళ్లి నిర్వహించారు. ఆ తర్వాత నుంచి అత్తాకోడళ్లు ఒకే ఇంట్లో ఉంటున్నారు. వివాహం తర్వాత ఆమె పెద్ద కుమారుడు స్వదేశానికి రాలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు మహిళ చిన్న కుమారుడు పోర్చుగల్ నుంచి వచ్చారు. కొన్ని రోజులు కుటుంబంతో ఉండి ఈ ఏడాది జనవరిలో తిరిగి వెళ్లిపోయాడు. అతడు వెళ్లిపోయిన కొన్నాళ్లు ఆ కోడలు... తన అత్త, ఆమె చిన్న కుమారుడిపై అత్యాచార కేసు పెట్టింది. నగ్న ఫొటోలు చూపించి అతడు తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆ విషయం బయటకు చెప్పొద్దంటూ తన అత్త బెదిరించిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు ఆ మహిళ, ఆమె చిన్న కుమారుడిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆ మహిళ కింది కోర్టులను ఆశ్రయించగా... ఆమె పిటిషన్‌ను న్యాయస్థానాలు కొట్టేశాయి. దీంతో ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అణగారిన వర్గాలకు నిర్ణయాత్మక అధికారం కావాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: సమాజంలో అణగారిన, వెనకబడిన వర్గాలకు నిర్ణయాత్మక అధికారం కావాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. వారి వారి కులాలకు సంబంధించి అభివృద్ధి వైపు నడిపించే నిజమైన అధికారం వారికి చెందాలన్నది జనసేన ఆకాంక్ష అని, ఇప్పటి వరకు అధికారం చూడని కులాలకు నిజమైన అధికారం దక్కాలని అన్నారు. శనివారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమక్షంలో అనేక మంది కీలక నేతలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ప్రతి సభలోనూ కులాల గురించి మాట్లాడతానని వైసీపీ నాయకులు అంటుంటారని, 80 శాతం నామినేటెడ్ పోస్టులను, ఇతర పదవులను ఒకే కులానికి కట్టబెట్టిన వైసీపీకి అసలు కులాల గురించి మాట్లాడే నైతిక అర్హత కూడా లేదని గుర్తించుకోవాలని స్పష్టం చేశారు. తాను కులాల గురించి ఎప్పుడు మాట్లాడినా విద్వేషాలు నింపేలా మాట్లాడనని, ఆయా కులాల సాధికారత, అభివృద్ధి ఎలా జరగాలి అన్నదానిపైనే నిజాలు మాట్లాడతానన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి రాకుండా ఉండాలనే స్పష్టమైన ఆలోచనతో, మరో ఛాన్స్ తీసుకోకూడదనే ఉద్దేశంతోనే జనసేన, టీడీపీ కలిసి ఎన్నికలకు వెళ్లబోతున్నాయని చెప్పారు. కచ్చితంగా గెలవాలన్నదే లక్ష్యమని, త్రిముఖ పోటీ జరిగితే రెండు మూడు శాతంతో జగన్ ప్రభుత్వం మళ్లీ ఏర్పడితే వనరులు, వ్యవస్థలనేవి రాష్ట్రంలో ఏమీ ఉండవని అన్నారు. 'ప్రజల కోసం నిలబడడమనే నా పంథా మార్చుకోను. నా కోసం నిలబడే వారికి వెన్నుదన్నుగా ఉంటాను' అని పవన్ అన్నారు.

జనసేనలో చేరికలు

రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అనేక మంది ప్రముఖులు జనసేనలో చేరారు. రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి వ్యాపారవేత్త చిక్కాల దొరబాబు, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు దుగ్గన నాగరాజు, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యకులు కలగ పాల్ పురుషోత్తం, ఎదువాక శ్రీ వెంకటగిరి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన పొగిరి సురేష్ బాబు, ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వై.శ్రీనివాసరాజు భారీఎత్తున తమ అనుచరులతో కలసి జనసేనలో చేరారు. పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ప్రోటోకాల్ కమిటీ చైర్మన్ మలినిడి తిరుమలరావు, మత్స్యకార వికాస విభాగం చైర్మన్ బొమ్మిడి నాయకర్, ప్రధాన కార్యదర్శులు టి.శివశంకర్, బొలిసెట్టి సత్య, నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, పంచకర్ల సందీప్, అమ్మిసెట్టి వాసు, పిసిని చంద్రమోహన్, కోటంరాజు శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అది యువగళ మేళా?: ఎంపి విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అది యువగళమా? లేక స్కూలు పిల్లల్లో బానిస భావాలు పెంచే కార్యక్రమమా లోకేశ్ అంటూ రాజ్యసభ సభ్యుడు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన అమ్మ ఒడి పథకం దండగ అని రాళ్లు విసిరిన వ్యక్తి లోకేశ్ అని విజయసాయి రెడ్డి మండిపడ్డారు. పిల్లల చదువుల గురించి కొంచమైనా బాధ్యత ఉందా అని ప్రశ్నించారు. లోకేశ్ పాదయాత్రలో బడిపిల్లలతో పాదాభివందనం చేయించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. వాళ్లు తొడుక్కున్న యూనిఫాం నువ్వు ఇచ్చింది కాదని లోకేశ్‌ని ఉద్దేశిస్తూ అన్నారు. పసిపిల్లలతో పాదాలకు నమస్కారాలు పెట్టించుకోవడం అమానవీయం కాదా అని లోకేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేందుకు అవసరమైన తర్ఫీదు స్కూళ్ల స్థాయి నుంచే అందించాలని విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు.

భారత్‌లో 66 శాతం మలేరియా కేసులు: డబ్ల్యూహెచ్‌ఓ

వాషింగ్టన్: గతేడాది భారత్‌లో 66 శాతం మలేరియా కేసులు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రచురించిన ప్రపంచ మలేరియా నివేదిక 2023లో పేర్కొంది. వీటిలో దాదాపు 46 శాతం ప్లాస్మోడియం వైవాక్స్ వల్ల సంభవించాయని తెలిపింది. దోమ తెరలు, మందులు వినియోగించడం ద్వారా చిన్నపిల్లలు, గర్భిణీలలో మలేరియాను నివారించడంలో సహాయపడతాయని తెలిపింది. ఆగ్నేయాసియా ప్రాంతంలో 77 శాతం మరణాలు తగ్గాయని తెలిపింది. కాగా ఆగ్నేయాసియాలోని మొత్తం మలేరియా మరణాలలో 94 శాతం మరణాలు భారతదేశం, ఇండోనేసియాలో ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 2019లో 233 మిలియన్ల మలేరియా కేసులు నమోదు కాగా 2022లో అవి 249 మిలియన్ కేసులకు చేరుకున్నాయి. 2019 కంటే 2022లో 16 మిలియన్ కేసులు పెరిగాయని నివేదిక పేర్కొంది. కోవిడ్-19, మాదకద్రవ్యాలు, పురుగుమందుల నిరోధకత, మానవతా సంక్షోభాలు, వనరుల పరిమితులు, వాతావరణ మార్పుల ప్రభావాలు వంటివి మలేరియాపై పోరాటానికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొంది. 2016 నుండి నేటి వరకు శ్రీలంక మలేరియా రహిత దేశంగా కొనసాగుతుందని పేర్కొంది.

లండన్‌లో భారత విద్యార్థి మృతి

లండన్: లండన్‌లో భారత విద్యార్థి మిత్‌కుమార్ పటేల్ (23) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మిత్ కుమార్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లాడు. రెండు నెలల అనంతరం నవంబర్ 17వ తేదీన మిత్‌కుమార్ అదృశ్యమయ్యాడు. బంధువుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. నవంబర్ 21వ తేదీన తూర్పు లండన్‌లోని కానరీ వార్ఫ్ ప్రాంతానికి సమీపంలో థేమ్స్ నదిలో పోలీసులు అతని మృతదేహాన్ని గుర్తించారు. మిత్‌కుమార్ మృతికి సంబంధించి ఎలాంటి అనుమానాలు లేవని మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. మిత్‌కుమార్ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. అతని తల్లిదండ్రులకు ఆర్థిక సాయం చేసేందుకు గో ఫండ్ మీ అనే ఆన్‌లైన్ ఫండ్ రైజర్ ద్వారా నిధుల సేకరణ ప్రారంభించినట్లు తన బంధువు పార్థ్‌పటేల్ తెలిపాడు. ఒక్కవారం వ్యవధిలోనే జీబీపీ (గ్రేట్ బ్రిటన్ పౌండ్స్) 4,500కి (భారత కరెన్సీలో 4 లక్షల 76 వేలు) పైగా వచ్చాయని పటేల్ అన్నారు. 'ఉన్నత చదువుల కోసం మిత్‌కుమార్ సెప్టెంబర్‌లో లండన్‌కి వచ్చాడు. షెఫీల్డ్ హాలం విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సు చదవడానికి ఇక్కడికి వచ్చాడు. ఇక్కడ అమెజాన్‌లో అతనికి పార్ట్‌టైం జాబ్ కూడా వచ్చింది. నవంబర్ 17వ తేదీ డైలీ వాక్‌కి వెళ్లిన మిత్... మళ్లీ తిరిగి ఇంటికి వెళ్లలేదు. మాకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇంతలోనే చనిపోవడం బాధకు గురిచేస్తుంది. సేకరించిన డబ్బుల్ని అతని కుటుంబానికి అందజేస్తాం. మృతదేహాన్ని భారత్‌కి పంపిస్తాం' అని పార్థ్‌పటేల్ అన్నారు.

శాఖాహారులు భారత్‌లోనే అధికం

వరల్డ్ అట్లాస్ నివేదిక వెల్లడి

వాషింగ్టన్: అత్యధిక శాఖాహారులు గల దేశాల జాబితాను వరల్డ్ అట్లాస్ వెల్లడించింది. ఈ నివేదికలో భారతదేశం అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం దేశ జనాభాలో 38 శాతం మంది శాకాహారులు ఉన్నారని తేలింది. 6వ శతాబ్దంలో బౌద్ధమతం, జైనమతం పరిచయం అయినప్పటి నుంచే ఈ శాకాహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు గుర్తించవచ్చు. భారత్‌లోని శాకాహారుల్లో కొంతమంది లాక్టో-శాఖాహారానికి కట్టుబడి ఉంటారు. వీళ్లు తమ ఆహారంలో పాల ఉత్పత్తులు చేర్చుకుంటారు. గుడ్లు మాత్రం తినరు. ఈ విభిన్నమైన ఆహార విధానాలు భారతదేశపు సాంస్కృతిక, చారిత్రక ప్రభావాలను ప్రతిబింబిస్తాయి. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ప్రపంచ వ్యాప్తంగా అతి తక్కువ మాంసం వినియోగ రేటులో ఉన్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ప్రజలు శాకాహారం వైపు మొగ్గు చూపడానికి ఆరోగ్యం, పర్యావరణ ఆందోళనలు లేదా ఇతర కారణాలు ఉండొచ్చని నివేదిక సూచిస్తోంది. మతం, నైతిక ప్రేరణలు, ఆర్థిక పరిగణనలు, మాంసం పట్ల అసహ్యం, సాంస్కృతిక ప్రభావాలు వంటి అంశాలు ఈ ధోరణికి దోహదపడతాయని నివేదిక పేర్కొంది. ఇక లింగాయత్‌లు, బ్రాహ్మణులు, జైనులు, వైష్ణవులు కేవలం శాకాహారమే తీసుకుంటారని అందరికీ తెలుసు. ఇక భారత్ తర్వాత ఇజ్రాయిల్ రెండో స్థానంలో ఉన్నట్టు ఆ నివేదిక పేర్కొంది. ఇజ్రాయిల్‌లో ఉన్న మొత్తం జనాభాలో 18 శాతం మంది శాకాహారులు ఉన్నట్టు వరల్డ్ అట్లాస్ వెల్లడించింది. ఇజ్రాయిల్‌లో శాకాహార భావనను ప్రవేశపెట్టడంలో జుడాయిజం కీలక పాత్ర పోషించింది. దీని తర్వాత తైవాన్, ఇటలీ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. తైవాన్‌లో 12 శాతం, ఇటలీలో 10 శాతం మంది శాకాహారులున్నట్టు ఆ నివేదిక స్పష్టం చేసింది. ఇక ఆస్ట్రియా, జర్మనీ, బ్రిటన్, బ్రెజిల్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా దేశాలు వరుస స్థానాల్లో నిలిచాయి.

ఏఐటీయూసీలోకి సీఐటీయూ నేత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బాలకాశి సంఘంలోని విధానాలు నచ్చక శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్, అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య సమక్షంలో ఏఐటీయూసీలో చేరారు. బాల కాశీ మెడలో ఏఐటీయూసీ కండువా వేసి ఓబులేసు యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ ఏఐటీయూసీ నియమనిబంధనలకు లోబడి ఈ సంస్థ ద్వారా కార్మిక వర్గానికి సేవలు అందిస్తానని అన్నారు. చరిత్ర కలిగిన ఏఐటీయూసీలో చేరడం ఆనందంగా ఉందని, ఆ సంస్థ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో అమలు చేస్తానని హామీ ఇచ్చారు. బాలకాశిని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం అభినందించింది.

నకిలీ కరెన్సీ గుట్టు రట్టు

న్యూఢిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) శనివారం నాలుగు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించిన నకిలీ కరెన్సీ రాకెట్‌ను ఛేదించింది. ప్రింటింగ్ మిషన్లు, ప్రింటింగ్ పేపర్లు స్వాధీనం చేసుకుంది. రూ.6,600 నకిలీ కరెన్సీ నోట్లను సీజ్‌చేసింది. నకిలీ కరెన్సీ అంతా రూ.500, రూ.200, రూ.100 నోట్ల రూపంలో ఉంది. భారత శిక్షాస్మృతిలోని(ఐపీసీ) సంబంధిత సెక్షన్ల కింద నవంబర్ 24న నమోదైన కేసుపై ఎన్‌ఐఏ ఈ చర్య తీసుకుంది. సరిహద్దుల గుండా నకిలీ కరెన్సీ నోట్లను రవాణా చేయడానికి, వివిధ రాష్ట్రాల్లో నకిలీ కరెన్సీ చలామణిని ప్రోత్సహించడానికి నిందితులు కుట్ర పన్నినట్టు ఎన్‌ఐఏ అనుమానించింది. దీంతో శనివారం దాడులు చేసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కీలక నిందితుల ఆవరణలో తనిఖీలను చేపట్టింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో రాహుల్ తానాజీ పాటిల్, యవత్మాల్ జిల్లాలో శివపాటిల్, ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో వివేక్ ఠాకూర్, కర్నాటకలోని బళ్లారి జిల్లాలో మహేందర్, బీహార్‌లోని రోహ్తాస్ జిల్లాలో శశి భూషణ్ నివాసాలను సోదా చేసిన అధికారులు నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. శివపాటిల్ మరికొందరితో కలిసి మన దేశంలో చలామణికి పొరుగు దేశాల నుంచి నకిలీ కరెన్సీ, ప్రింటింగ్ మిషన్లను సేకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మహేందర్ ఇంట్లో ప్రింటర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోట్ల సరఫరా చేస్తానని హామీ ఇచ్చిన రాహుల్ తానాజీ పాటిల్, మోసపూరితంగా పొందిన సిమ్ కార్డులను ఉపయోగించి చెల్లింపులు జరుపుతున్నట్లు విచారణలో తేలింది.

మీ ఉపగ్రహాలను ధ్వంసం చేస్తాం

అమెరికాకు కిమ్ హెచ్చరిక

ప్యాంగ్యాంగ్: తమ జోలికి వస్తే ఊరుకునేది లేదని ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ అగ్రదేశం అమెరికాకు హెచ్చరికలు పంపారు. ఇటీవల ఉత్తర కొరియా నిఘా ఉపగ్రహాన్ని ప్రయోగించిన నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. ఈ మేరకు కొరియా రక్షణ శాఖ స్పందించింది. 'మా అంతరిక్ష ఆస్తులపై వాషింగ్టన్ దాడులకు ప్రయత్నిస్తే.. మేం ఆ దేశ నిఘా శాటిలైట్లను ధ్వంసం చేస్తాం. అలాంటి చర్యలను యుద్ధ ప్రకటనగా భావిస్తాం' అని అమెరికాకు ఉ.కొరియా హెచ్చరికలు చేసింది. నిఘా ఉపగ్రహాన్ని భూకక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు కిమ్ ప్రభుత్వం గతంలో రెండుసార్లు విఫలయత్నం చేసింది. అయితే ఈ నెల ప్రారంభంలో రష్యా సహకారంతో శాటిలైట్ ప్రయోగాన్ని విజయవంతం చేసింది. గతవారం ఈ ప్రయోగం జరగ్గా... కిమ్ లాంచింగ్‌ను వీక్షించారు. ఈ ప్రయోగంతో దక్షిణ కొరియా, జపాన్, అమెరికా దేశాలు తమ సైన్యాన్ని అప్రమత్తం చేశాయి. అలాగే రోదసీ ప్రయోగాల ద్వారా ఎదురయ్యే ముప్పును వివిధ మార్గాల ద్వారా ఎదుర్కొంటామని ఉ.కొరియా ప్రయోగాన్ని ఉద్దేశించి అమెరికా స్పందించింది. ఈ క్రమంలోనే కిమ్ హెచ్చరికలు చేశారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి: మాయావతి



లక్నో: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి డిమాండ్ చేశారు. పార్లమెంటు అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కానుండగా శనివారం అఖిలపక్ష సమావేశాన్ని కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కుల గణన కోసం దేశంలోని అన్ని దిక్కుల నుంచి డిమాండ్ వస్తున్నట్లు మాయావతి తెలిపారు. కుల గణన డిమాండ్‌తో బీజేపీ నిద్రలేని రాత్రులు గడుపుతోందని విమర్శించారు. జాతీయ స్థాయిలో సరైన పద్ధతిలో కుల గణన చేపట్టాలని, ప్రజలకు హక్కుల్ని అందేలా చూడాలని మాయావతి డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.